



ప్రమాద దృశ్యం

గోదారంత.. విషాదం



ప్రమాద ప్రాంతం వద్ద యువకుల దుస్తులు





కె.రోహిత్ | సబ్బితి క్రాంతి | సబ్బితి పాల్ | వడ్డే మహేష్



వడ్డే రాజేష్ | వై.సాయి | ఎలిపే రాజేష్ | నితీష్

గోదారిలో ఎనిమిది మంది గల్లంతు



మొగ్గతొడిగిన ఆశలు నిండు గోదావరిలో గల్లంతయ్యాయి. కన్నకలలన్నీ కన్నీటి సంద్రంగా మారాయి. వారి తల్లిదండ్రుల గుండె కన్నీటి గోదారైంది. అప్పటిదాకా ఆనందం.. ఉల్లాసం.. కేరింతలు.. సరదా సరదాగా సాగిపోయిన క్షణాలు. ఒక్కసారిగా గోదారంతా విషాదం.ఒక్కరా ఇద్దరా ఏకంగా 8 మంది స్నేహితులు గోదావరిలో గల్లంతయ్యారు.. సరదాగా గోదావరిలో స్నానం చేద్దామని వెళ్లారు.. ఒకరి వెంట ఒకరు ఏకంగా ఎనిమిది మంది గోదారిలోకి జారిపోయారు. ఎదుగుతున్న వయస్సు ఆ పిల్లలందరిదీ. ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.. కన్నా ఎక్కడున్నావ్.. రా నాన్నా.. అమ్మను వచ్చాను రారా.. అంటూ తల్లులు.. నాన్నా ఎక్కడున్నావ్.. రారా.. అంటూ తండ్రులు పిలుస్తున్నా.. వారి జాడేది..? గోదావరి ఒడ్డున దుఃఖ సాగరంలో ఉన్నారంతా. ఎక్కడున్నారో ఏమైపోయారో తెలియదు.. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గోదావరిలో గల్లంతైన తమ పిల్లలు క్షేమంగా తిరిగిరావాలని కన్నపేగు కొట్టుమిట్టాడుతోంది.. కనిపించినవారినల్లా కాపాడాలని వేడుకుంటోంది.

- సలాదివారిపాలెం వద్ద ఘటన
- స్నానానికి వెళ్లిన 11 మంది
- ఒకరిని కాపాడదామని మరొకరు
- వీరిలో నలుగురు సోదరులే
- సురక్షితంగా బయటపడిన ముగ్గురు
- ఒక వేడుకకు వచ్చిన స్నేహితులు
- కుటుంబాల్లో విషాదఛాయలు
- ముమ్మర గాలింపు చర్యలు

ముమ్మిడివరం, మే 26 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిలో స్నానానికి వెళ్లి ఎనిమిది మంది యువకులు గల్లంతయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధి సలాదివారిపాలెం వద్ద సోమవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. మొత్తం 11 మంది యువకులు స్నానానికి వెళ్లగా ముగ్గురు సురక్షితంగా బయట పడ్డారు. సమాచారం తెలుసుకున్న వెంటనే స్థానికులు వందలాదిగా నదీ తీర ప్రాంతానికి చేరుకున్నారు.ఈ ఘటనలో కాకినాడ ప్రాంతానికి చెందిన నలుగురు, ఐ.పోలవరం మండలం ఎర్రగరువుకు చెందిన ఇద్దరు సోదరులు, కె.గంగవరం మండలం శేరికలంకకు చెందిన ఒకరు, మండపేటకు చెందిన ఒకరు మొత్తం ఎనిమిది మంది ఉన్నారు. కె.గంగవరం మండలం శేరిలంకకు చెందిన కొండేపూడి నాగరాజు-చిన్నారి దంపతుల కుమార్తె ప్రేమజ్యోతి రజస్వల వేడుకకు ఆమె సోదరుడు పోలిశెట్టి అభిషేక్ ఆహ్వానంపై వివిధ ప్రాంతాలకు చెందిన మిత్రులు, బంధువులు హాజరయ్యారు. అందరూ సరదాగా వేడుకలో పాల్గొని విందు భోజనాలు ఆరగించిన తరువాత సరదాగా గౌతమి గోదావరిలో స్నానం చేసేందుకు 11 మంది మిత్రులు వెళ్లారు. బట్టలు, చెప్పులు, షూలు, సెల్‌ఫోన్లను ఒడ్డున పెట్టి స్నానానికి ఉపక్రమించారు. తొలుత ఒక యువకుడు స్నానానికి దిగాడు. ఒడ్డున స్నానం చేయడం వీలు పడకపోవడంతో కొంచెం ముందుకు వెళ్లేసరికి లోతుగా ఉండడంతో మునిగిపోయాడు. అది గ్రహించిన మరో ముగ్గురు అతడిని రక్షించేందుకు గోదావరిలోకి వెళ్లారు. వారు కూడా మునిగిపోతుండడంతో మరో ఇద్దరు ఇలా ఒకరి తరువాత ఒకరు నదిలోకి వెళ్లి గల్లంతయ్యారు. ఆపదను గ్రహించిన కాకినాడకు చెందిన దాసరి కరుణకుమార్ (17), మేడిశెట్టి చరణ్‌రోహిత్ (20), కనికెళ్ల సురేష్ (19) సురక్షితంగా బయటపడ్డారు.సాన్నానికి వెళ్లిన పదకొండు మందిలో ఎనిమిది మంది గల్లంతయ్యారు. కరుణకుమార్ స్థానికులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అందరూ ఆ ప్రాంతానికి చేరుకున్నారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన వారి ఆచూకీ కోసం ఇంజను పడవలపై గాలింపు చర్యలు చేపట్టారు. ప్రత్యేక బృందాలను రప్పిస్తున్నారు. కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావు, జేసీ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి, సీఐలు ఎం.మోహన్‌కుమార్, వెంకటనారాయణ, ఎస్ఐలు డి.జ్వాలాసాగర్, జానీబాషాలతోపాటు రెవెన్యూ, పోలీసు యంత్రాంగమంతా అక్కడికి చేరుకుని రాత్రివేళల్లో గాలింపు చర్యలు చేపట్టే అంశంపై చర్చలు జరిపారు. కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్పీ కృష్ణారావులు ఘటనకు దారితీసిన పరిస్థితులపై ప్రత్యక్ష సాక్షులను విచారించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకుని గౌతమి నదిలో గాలింపు చర్యలు చేపట్టాయి.

గల్లంతైన వారి వివరాలు ఇలా..

కాకినాడ జగన్నాథపురం ప్రాంతానికి చెందిన సబిత క్రాంతిఇమ్మానియేలు(19), సబిత పాల్ (18), తాతిపూడి నితీష్ (18), ఎలుమర్తి సాయి (18), మండపేటకు చెందిన రోహిత్ (18), శేరిలంక ప్రాంతానికి చెందిన ఎలిపే మహేష్ (14), ఐ.పోలవరం మండలం ఎర్రగరువుకు చెందిన అన్నదమ్ములైన వడ్డే మహేష్ (16), వడ్డే రాజేష్ (14) గల్లంతయ్యారు. వీరి కోసం ప్రస్తుతం గౌతమీ గోదావరి నదిలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.





ప్రత్యక్ష సాక్షితో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు, ఘటనా స్థలం వద్ద కోనసీమ కలెక్టర్, ఎస్పీలు

ఆ చెల్లికి దిక్కెవరు!

మండపేట: రోహిత్ తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతి చెందారు.. చెల్లికి అతనే ఆధారం. మండపేట మండలం అర్తమూరుకు చెందిన రోహిత్ తల్లిదండ్రులు కులపాక లలితాదేవి, రవీంద్రబాస్కర్ ప్రసాద్. వీరికి ఒకమ్మాయి,అబ్బాయి రోహిత్. వీరి చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతిచెందడంతో అతడి అమ్మమ్మ కోరంగి వద్ద మిషనరీ పాఠశాలలో చేర్పించి పిల్లలను చదివించింది. మిష నరీలో పదవ తరగతి తర్వాత రోహిత్ కాకినాడలోని పాలిటెక్నిక్‌లో చేరి మధ్యలోనే చదువు మానేశాడు.అతడి సోదరి ప్రస్తుతం సెకం డియర్‌లో ఉంది.కులపాక రోహిత్ (19) స్థానికంగా ఉన్న రైస్‌మిల్లులో పని చేస్తూ చెల్లెలితో కలిసి గొల్లపుంత కాలనీలో నివాసం ఉంటున్నాడు. గోదావరిలో రోహిత్ గల్లంతయ్యాడన్న విషయం తెలుసు కుని రోహిత్ పెద్దమ్మ, పెదనాన్నలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అన్న మరణంతో సోదరికి జీవితం అగమ్యగోచరంగా మారింది

ఆ తల్లికి కడుపుకోత..

ఐ.పోలవరం, మే 26(ఆంధ్రజ్యోతి): అమ్మమ్మ ఇంటికి జాతరకని వెళ్లిన అన్నదమ్ములు పదవ తరగతి చదువుతున్న వడ్డి మహేష్ (16), ఎనిమిదవ తరగతి చదువుతున్న వడ్డి రాజేష్(14) గోదావరిలో గల్లంతవ్వడంతో ఊరంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.మూలపొలం పంచాయతీ ఎర్రగరువుకు చెందిన వడ్డి భైరవస్వామి, భవానీ దంపతులకు ఇద్దరు కుమారులు. తల్లి భవాని కువైట్లో ఉండగా తండ్రి భైరవస్వామి వ్యవసాయంతో పాటు ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.

అమ్మా నాన్నలకు తోడెవరు..

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)/కాకినాడ క్రైం: అమ్మ, నాన్న, ఇద్దరు పిల్లలు.. ఇద్దరూ డిగ్రీ చదువుతున్నారు. తండ్రి నిర్వహించే చర్చిలోనే ఒకరు రిథమ్ ప్లేయర్‌గా, మరొకరు సింగర్. కాకినాడ జగన్నాథపురం యాళ్లవారిగరువు గోలీలపేట తుపాను బిల్డింగ్ ప్రాంతంలో నివసించే పాస్టర్ సబ్బిత రఘు, విజయ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు క్రాంతి, చిన్నబ్బాయి పాల్ డిగ్రీ చదువుతున్నారు. వీరు కొన్నేళ్లుగా మౌంట్‌మోరియా మినిస్ట్రీస్ తండ్రి సన్నిధి పేరిట పాస్టర్ రఘు చర్చి నిర్వహిస్తున్నారు. ఈ చర్చికి నిత్యం వచ్చే అబి, పాస్టర్ రఘు తనయులు స్నేహితులుగా మెలిగేవారు. వీరింటికి సమీపంలో ఉండే దాసరి కరుణకుమార్ స్నేహితుడే. వీరంతా కలిసి అబి చెల్లెలి ఫంక్షన్ నిమిత్తం కాకినాడ జగన్నాథపురంనుంచి ఉదయం పది గంటల సమయంలో కె.గంగవరం మండలం శేర్లంకకు వెళ్లారు. కాకినాడకు అన్నమ్మ ఘాటీ ముగ్గుపేటకు చెందిన తాతిపూడి రాజు, వరలక్ష్మి దంపతుల కుమారు నితీష్ కూడా అక్కడకు వెళ్లాడు. అతడు సంజీవి డిగ్రీకళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. తండ్రి ఆటో డ్రైవర్, తల్లి గృహిణి. ప్రస్తుతం వీరి కుటుంబం గురజనాపల్లిలో ఉంటోంది. కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని మీసాల చిన్నయ్యపేటకు చెందిన యలమర్తి ప్రసాద్ కుమారుడు సాయి మహేష్(19). తండ్రితో కలిసి ఆయిల్ కంపెనీలో చేస్తున్నాడు. అతడు కూడా స్నేహితులతో కలిసి గోదావరిలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. వీరి స్వస్థలం రాజోలు మండలం పొన్నమండలోని మెరకపాలెం కాగా ఉపాధి నిమిత్తం తూరంగిలో ఉంటున్నారు.

కళ్లెదుటే మునిగిపోయారు..



గోదావరిలో కళ్లెదుటే మిత్రులంతా ఒక్కొక్కరిగా మునిగిపోతున్నారు. వారిని రక్షించేందుకు వెళ్లిన వారు మునిగిపోతున్నారు. వారిని కాపాడేందుకు విఫలయత్నం చేశాం. పరిస్థితి చేజారిపోవడంతో ఒడ్డుకు చేరుకున్నాం. ఈ సమాచారాన్ని స్థానికులకు తెలియజేశాం. మిత్రులంతా కళ్లెదుటే ఒక్కొక్కరిగా గల్లంతు కావడంతో కరుణకుమార్ రోదిస్తున్న తీరు స్థానికులను కంట తడి పెట్టిస్తోంది. ఇదే విషయం అధికారులు, జిల్లా ఎస్పీకి వివరించాడు.

- దాసరి కరుణకుమార్, ప్రత్యక్ష సాక్షి

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఆరా..

ముమ్మిడివరం/రామచంద్రపురం (ద్రాక్షారామ), మే 26(ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో 8 మంది యువకులు గల్లంతు ఘటనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రమాదాలు జరిగే ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫోన్‌లో సంప్రదించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

బాధితులకు నాయకుల హామీ

బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా అండగా ఉంటుందని నాయకులు చెప్పారు. రాజమహేంద్రవరం ప్రమాదం, గోదావరిలో స్నానానికి వెళ్లి 8 మంది గల్లంతు కావడంపై ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేష్, మంత్రి సుభాష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. సుభాష్ కోనసీమ జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు.సహాయ చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. యువకులు గల్లంతైన ఘటనపై ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు విచారం వ్యక్తం చేశారు. కలెక్టర్, పోలీసు అధికారులతో మాట్లాడి సహాయక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

ఆనందం ఆవిరైంది!

పుట్టినరోజును ఆనందంగా గడుపుదామని వెళుతూ మృత్యువాత

- కారును ఢీకొట్టిన లారీ
- నలుగురు మృత్యువాత
- ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి
- మనవరాలి పుట్టినరోజునే ఘటన
- పుట్టినరోజునాడే భార్య మృతి
- భర్త పరిస్థితి విషమం
- చాగల్లులో విషాదఛాయలు
- ఆదుకుంటామన్న నాయకులు

రాజమహేంద్రవరం/అర్బన్/చాగల్లు/కొవ్వూరు/రాజానగరం, మే 26 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన తమ కుమార్తెను మనవడు..మనవరాలిలో చూసుకుంటూ జీవిస్తున్నారు.. తల్లిదండ్రులు లేని లోటు లేకుండా చూసుకుం టున్నారు. జీవితం సాఫీగా సాగిపోతోంది.. విధి కన్నుకుట్టిందో ఏమో ఆ ఇద్దరినీ అనాథలను చేసింది..క్షణకాలంలో ముంచుకొచ్చిన మృత్యువు నలుగురు ప్రాణాలను బలితీసుకుంది. మరొకరు ఆస్పత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నారు. మనవరాలి పుట్టినరోజుకని కారులో ఆనందం బయలు దేరిన ఆ కుటుంబం అంతలోనే తీవ్ర విషాదంలో మునిగిపోయింది. చాగల్లు మండలం మార్కొండపాడుకు చెందిన ఉప్పులూరి వరప్రసాద్ గేదేలను పెంచుతూ,హైచర్ వ్యాన్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. వరప్రసాద్ కుమార్తె గత రెండేళ్ల కిందట విద్యుదాఘాతంతో మృతిచెందింది. దీంతో మనవరాలు పూజా భువనేశ్వరి, మనవడు శంకర్‌ని తమ వద్ద ఉంచుకుని చదివిస్తున్నారు. ఇదిలా ఉండగా నెలన్నర కిందట ఉప్పులూరి వరప్రసాద్ (60), భార్య శివ లీలావతి(56), లీలావతి తల్లి ఇమ్మాని వీరవెంకట సత్యవతి (75) కొవ్వూరు జూనియర్ కళాశాల సమీపంలోని సిటీ కేబుల్ పక్కన ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన లక్కంసాని సురేశ్ అవంతి ఫీడ్స్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ భార్య బిందు(34)తో అదే ఇంట్లో ఒక వాటాలో ఉం టున్నారు. సురేశ్, బిందు దంపతులకు పెళ్లై ఏడేళ్లయినా పిల్లలు లేరు. దీంతో ఇరు కుటుంబాలు దగ్గరయ్యాయి.కాకినాడలో ఇంజ నీరింగ్ చదువుతున్న ప్రసాద్ మనవరాలు భువనేశ్వరి పుట్టిన రోజు సోమవారం కావడంతో వెళదామని అనుకున్నారు. ఈ మేరకు పక్క వాటాలో ఉం టున్న సురేష్ తన స్నేహితుడు సత్యనారాయణ వద్ద నుంచి డిజైర్ షిఫ్ట్ కారు తీసుకురాగా ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి ఐదుగురూ బయలుదేరారు. గామన్ బ్రిడ్జి రోడ్డుపై 9.30 గంటల సమయంలో రవాణా శాఖాధికారులు సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండడం గమనించిన డ్రైవర్ రికార్డులు సక్రమంగా లేకపోవడంతో అవతల లేన్‌లో వస్తున్న బొగ్గులోడు లారీ డివైడర్ మార్గం నుంచి దారి మళ్లించినట్టుగా సమాచారం.అదే సమయంలో ఇవతల వైపు లేనులో వెళుతున్న కారును మధ్యలో ఢీకొట్టి రోడ్డు కిందకు నెట్టుకుపోయింది. వెనుక ఉన్న చెట్టుకు లారీకి మధ్య కారు ఉండిపోయి ఇంజన్ భాగం నుజ్జునుజ్జయింది. వరప్రసాద్ గుండెలకు స్టీరింగ్ బలంగా నొక్కుకుపోయినట్లు తెలుస్తోంది. వెనుక సీట్లో కూర్చున ముగ్గురూ మహిళలు నలిగిపోయారు. డోర్లను బలవంతంగా లాగి వాళ్లను బయటకు తీశారు. కారు లోపల అంతా రక్తమడుగులా మారిపోయింది. బ్యాగ్ లోని భోజనం, డిక్కీలోని పిండి వంటలు ఉన్నాయి.

ప్రమాదంలో తీవ్రగాయపడిన భర్త లక్కంసాని సురేష్ రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగానే ఉన్నట్టు సమాచారం. రోడ్డు ప్రమాదం సమాచారం తెలిసిన వెంటనే లక్కంసాని సురేష్ కుటుంబీకులు ప్రభుత్వ బోధనాసుపత్రికి చేరుకున్నారు. మృతురాలి సోదరుడు రాజేష్, తండ్రి శ్రీనివాస్, అత్త పద్మ, ఇతర బంధుమిత్రులు ఆసుపత్రికి తరలివచ్చారు. పోస్టుమార్టంనకు సంబంధించిన ఇతర లాంఛనాలు పూర్తి చేసుకున్నారు.మిగిలిన మృతుల కుటుంబ సభ్యులెవరూ సాయంత్రం వరకూ ఆసుపత్రికి చేరుకోలేకపోయారు. కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత, పోలీసు శవ పంచనామా పూర్తి చేసేంత వరకూ మృతదేహాలను ఆసుపత్రి మార్చురీ ఎదుట అంబులెన్సుల్లోనే ఉంచారు. పోలీసు నివేదిక అందిన తర్వాతే ఆసుపత్రి ఫోరెన్సిక్ వైద్యులు మృతదేహాలను మార్చురీకి తరలించి పోస్టుమార్టం చేశారు.దీంతో చాగల్లు మండలం దారవరం, మార్కొండపాడు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబీకులు, బంధువులు శోక సముద్రంలో మునిగిపోయారు.ప్రమాద సమాచారం అందుకున్న అధికారులు ఆర్డీవో సురేష్, డీఎస్పీ శ్రీకాంత్, రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్, తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి, ఎస్ఐలు మనోహర్, నాగార్జున, ఎంవీఐ రవికుమార్ హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ఇరుక్కుపోయిన మృతులను, క్షతగాత్రులను బయటకు తీసి సహాయక చర్యలు చేపట్టారు. మృత దేహాలని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు డ్రైవర్‌ను అదుపులోని తీసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

పుట్టినరోజు నాడే..

ఈ దుర్ఘటనలో మరణించిన లక్కంసాని బిందు తన పుట్టిన రోజు నాడే మృత్యువాత పడడం కుటుంబ సభ్యులతో పాటు అందరినీ కలచివేసింది. కుమార్తె మరణాన్ని జీర్ణించుకోలేని బిందు తండ్రి శ్రీనివాస్ ఆసుపత్రి ఆవరణలోని పోలీస్ అవుట్‌పోస్టు ఎదుట విలపించారు. పుట్టినరోజు నాడే ఇలా జరగడం తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

అనాథలుగా ఇద్దరు పిల్లలు

చిన్నప్పుడే తల్లి మరణం. తర్వాత తండ్రి వేరొక పెళ్లితో దూరం. ఇప్పుడు ఆసరాగా ఉన్న తాత, అమ్మమ్మను కూడా మృత్యువు తీసుకుపోగా పిల్లల పరిస్థితి దయనీయంగా మారింది.లీలావతి కూతురు భవానీకి భువనేశ్వరి, శంకర్ ఇద్దరు పిల్లలున్నారు. వీళ్ల చిన్నప్పుడే తల్లి చనిపోగా తండ్రి వేరొక పెళ్లి చేసుకొని వెళ్లిపోయాడు.దీంతో భువనేశ్వరి,శంకర్‌ను తాతయ్య అక్కున చేర్చుకున్నాడు. శంకర్ దాతల ఆర్థిక సాయంతో చదువుతున్నాడు. భువనేశ్వరి కాకినాడలో బీటెక్ చదువుతోంది. మంత్రులు కందుల దుర్గేష్, మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు సంఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధి తులను ఆదుకుంటామని తెలిపారు. పిల్లల చదువులకు సహాయం చేస్తామని పేర్కొన్నారు.



వరప్రసాద్



లీలావతి



బిందు



సత్యవతి

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 432 అర్జీలు

కలెక్టరేట్(కాకినాడ), మే 26 (ఆంధ్రజ్యోతి):ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులను అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని జేసీ రాహుల్‌మీనా ఆదేశించారు.కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పలు సమస్యలపై 432 అర్జీలు వచ్చాయి. డీఆర్వో వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 61 అర్జీలు

కాకినాడ క్రైం, మే 26(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 61మంది సోమవారం ఎస్పీ జి.బిందుమాధవ్ పోలీస్ గ్రీవెన్స్‌లో అర్జీలు అందజేశారు. ఫిర్యాదులు సమ్మతమైనవైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయాలని ఆయన ఆదేశించారు.

పెనుగుదురులో చోరీ 5

అల్పపీడన ప్రభావంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి: జేసీ

కలెక్టరేట్(కాకినాడ), మే 26(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో భారీవర్షాలకు అవకాశం ఉన్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జేసీ రాహుల్‌మీనా ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్‌మీనా మాట్లాడుతూ పశ్చిమమధ్య బంగాళాఖాతంలో మంగళవారంనుంచి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నందున దీని ప్రభావంతో కోస్తా జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల యాజమాన్య సంస్థ తెలిపిందన్నారు. అన్నిశాఖల అధికారులు, తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. 50నుంచి 60 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే అవకాశం ఉందని, విపత్తులను ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని సూచించారు. డీఆర్వో వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ పాల్గొన్నారు.

జాతీయ బాలల పురస్కారాలు 2025కు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ), మే 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 6 నుంచి 18ఏళ్లలోపు వయస్సు గల బాలబాలికల నుంచి కేంద్ర ప్రభుత్వ స్త్రీ శిశు సంక్షేమశాఖ జాతీయ ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలల పురస్కారాలను ప్రదానం చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోందని జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ, సాధికారిత అధికారిణి కె.విజయకుమారి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్యధైర్యసాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మొదలైనవాటిలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రతిభ కనబరుస్తున్న ఆసక్తిగల బాలబాలికలు జూలై 31 లోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేంద్ర కమిటీ ద్వారా పరిశీలించి ఎంపికైన వారికి న్యూఢిల్లీలో డిసెంబరు 26న భారత రాష్ట్రపతి నుంచి బహుమతితోపాటు ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందజేస్తారని తెలిపారు.

కాకినాడలో విజయవంతంగా యోగాంధ్ర

కార్పొరేషన్(కాకినాడ),మే26(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో ఉదయం 6 నుంచి 8గంటల వరకు యోగాంధ్ర 2025లో భాగంగా మూడు లైట్ల జంక్షన్‌నుంచి ఎండోమెంట్స్ భవనం రోడ్డు వరకు యోగా శిక్షణా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాకినాడ నగరపాలక విభాగాధిపతులు, వార్డు సచివాలయ సిబ్బంది, యోగా ట్రైనర్లు 300కుపైగా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. యోగాసాధన, ఆరోగ్యజాగృతి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. యోగా గురు, యోగా ట్రైనర్లు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం వంటి అంశాలను ప్రదర్శిస్తూ సులభంగా అనుసరించగల మార్గాలను వివరించారు. ప్రజల్లో ఆరోగ్యపరమైన చైతన్యాన్ని పెంచే కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కమిషనర్ సుధాకర్ తెలిపారు.



యోగాసనాలు, ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న శిక్షకులు



వేదికపై యోగాసనాలు వేస్తున్న బాలిక

యోగాంధ్ర రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),మే26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతిఒక్కరూ యోగాంధ్ర రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21న విశాఖలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పాల్గొంటారన్నారు. దీనిలో భాగంగానే ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామన్నారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్ సంబంధిత లింక్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

ఉద్యమంలా రిజిస్ట్రేషన్ చేపట్టాలి: జేసీ

యోగాంధ్రకార్యక్రమాల్లో భాగస్వామ్యం అవ్వడానికి ప్రతిఒక్కరూ ఉద్యమంలా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని జేసీ రాహుల్ మీనా పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు,కళాశాలలు అధ్యాపకులతో యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌పై సమావేశం నిర్వహించారు.



మెక్లారిన్ స్కూలు మైదానంలో మామిడి పండ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

మధుర ఫల మామిడి..!



- మార్కెట్లు నిండా మామిడి పండ్ల రాశులు
- ధర అందుబాటులో.. రైతులకు మాత్రం నిరాశే
- కాకినాడ మెక్లారిన్ స్కూలు మైదానంలో అది పెద్ద మామిడి పండ్ల మార్కెట్

కార్పొరేషన్ (కాకినాడ), మే 26 (ఆంధ్రజ్యోతి): సీజనల్ ఫ్రూట్స్‌లో మామిడికాయకు ప్రత్యేక స్థానముంది. వేసవి వచ్చిందంటే ఆమ్ర ప్రియులు మార్కెట్లకు పరుగులు తీస్తారు. కాకినాడలో మెక్లారిన్ స్కూలు మైదానంలో ప్రత్యేకమైన మామిడి పండ్ల మార్కెట్ ఏర్పాటు చేశారు. ఇక్కడకు తుని, కత్తిపూడి, చేబ్రోలు, గొల్లప్రోలు, పిఠాపురం, జగ్గంపేట, పెద్దాపురం, ప్రత్తిపాడు, గోకవరం, కొత్తపల్లి పరిసర ప్రాంతాల నుంచి వివిధ రకాల మామిడి పండ్లు అమ్మకానికి వస్తున్నాయి. ఈ మార్కెట్లో కొత్తపల్లి మామిడికి ప్రత్యేక డిమాండ్ ఉండడం విశేషం. సామాన్యుల నుంచి ఎగువ తరగతి వరకు అందరికీ అందుబాటులో ఉండే ధరలతో మామిడి మార్కెట్ సందడి చేస్తోంది. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు హోల్‌సేల్ మార్కెట్ జరుగుతుంది. ఆ తర్వాత రిటైల్ అమ్మకాలను నిర్వాహకులు అందుబాటులోకి తీసుకొచ్చారు. 34 స్టాల్స్‌లో వ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నారు. వారికి అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించారు. రాత్రి సమయంలో సెక్యూరిటీ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉన్నంతలో ఏర్పాట్లు బాగున్నాయని వ్యాపారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హోల్‌సేల్, రిటైల్ కలిపి రోజుకి రూ.50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఇక్కడ వ్యాపారం జరుగుతుందని అంచనా వేస్తున్నారు.

ధరలు ఇలా...

కొత్తపల్లి కొబ్బరి పరక రూ.300 నుంచి 700
బంగినపల్లి పరక రూ.200 నుంచి 700
చెరకు రసాలు రూ.200 నుంచి రూ.500
పండు మామిడి (వంద కాయలు) రూ.1500 నుంచి రూ.4వేలు.
కలెక్టర్ రకం పచ్చి మామిడికాయలను మామిడి తాండ్ర కోసం విక్రయిస్తున్నారు.





మెక్లారిన్ స్కూలు మైదానంలో విక్రయానికి సిద్ధంగా వున్న వివిధ రకాల మామిడి పండ్లు



మామిడి పండ్ల సీజన్ ఇది. ఎక్కడ చూసినా మామిడి పండ్ల వ్యాపారాలతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. మామిడి పండు అంటే ఇష్టపడనివారుంటారా. ఒకరికి బంగినపల్లి అంటే ప్రాణం. మరొకరికి రసాలంటే ఇష్టం. అనేక రకాలు.. ఒక్కో రకానిది ఒక్కో రుచి. ప్రస్తుతం ప్రతి చోటా ఇబ్బడిముబ్బడిగా మామిడి పండ్ల రాశులు కనిపిస్తున్నాయి. ఈసారి మామిడి రైతులకు తగిన గిట్టుబాటు లభించలేదు. దీంతో వరుస వర్షాలతో ధరలు మరింత దిగజారాయి. మామిడి ప్రియులకు మాత్రం పండగే. ధరలు అందుబాటులో ఉండడంతో కొనుగోళ్లూ బాగున్నాయి.





ప్రత్తిపాడు చెక్‌పోస్టు సెంటర్లోని మార్కెట్లో విక్రయానికి సిద్ధంగా వున్న మామిడి పండ్లు

ప్రత్తిపాడులో మామిడి మార్కెట్ కళకళ

ప్రత్తిపాడు, మే 26 (ఆంధ్రజ్యోతి): మామిడి మార్కెట్‌లో ఒకటైన ప్రత్తిపాడులో అమ్మకాలు, కొనుగోళ్లు ఊపందుకున్నాయి. స్థానిక ఫారెస్ట్ చెక్‌పోస్టు సెంటర్ మామిడి మార్కెట్ అమ్మకాలతో కళకళలాడుతోంది. ఇతర రాష్ట్రాలకు మామిడి ఎగుమతులు లేకపోవడం వల్లే ధరలు ఈసారి పడిపోయాయి. దీనికి తోడు మామిడి తాండ్ర పరిశ్రమల ట్యాంకర్లలో మామిడి నిల్వలు అధికంగా ఉండడం వల్ల ఈసారి కొనుగోళ్లు తగ్గినట్టు మామిడి రైతులు చెప్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది మామిడి ధరలు సగానికి సగం తగ్గడంతో మధురఫలం మామిడి కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ క్రమంలో మార్కెట్‌లో అమ్మకాలు ఊపందుకున్నాయి. ప్రత్తిపాడు మండలంలోని ప్రత్తిపాడు, టి.రాయవరం, లంపకలోవ, జగన్నాథపురం, ఉత్తరకంచి, పెద్దిపాలెం, ఒమ్మంగి, శరభవరం, గజ్జనపూడి, వెంకటనగరం, వాకపల్లి, ధర్మవరం, పోతులూరు, పిఠాపురం రూరల్ మండలంలోని వెల్దుర్తి, దొంతమూరు, రాపర్తి, రాయవరం, కిర్లంపూడి మండలంలోని సింహాద్రిపురం, జగపతినగరం, గెద్దనాపల్లి, వేలంక, ఏలేశ్వరం మండలంలోని సిరిపురం, చిన్నింపేట తదితర గ్రామాలకు చెందిన మామిడి రైతులు ప్రత్తిపాడు ఫారెస్ట్ చెక్‌పోస్టు సెంటరుకు తమ దిగుబడులను తరలిస్తున్నారు. గతేడాది బంగినపల్లి రకం టన్ను రూ.40వేలు పలుకగా, ఈ ఏడాది రూ.18వేలకు మించి లేదు. గత ఏడాది సువర్ణరేఖ రూ.45వేలు ఉండగా ఈ ఏడాది రూ.25వేలు, చెరుకురసం గత ఏడాది రూ.42 వేలు ఉండగా ఈ ఏడాది రూ.25వేలు, గత ఏడాది కలెక్టర్ రకం రూ.22వేలు ఉండగా ఈ ఏడాది రూ.7వేలు పలుకుతోంది. అయితే సగానికి సగం తగ్గిన కారణంగా రైతులు దిగాలుపడ్డారు. ఇప్పటికే ఈదురుగాలులు, భారీ వర్షాల వల్ల దిగుబడులు దెబ్బతిని అంతంతమాత్రంగా ఉండగా, ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు తగ్గడంతో మరింత నిరాశ కలుగుతోందని మామిడి రైతులు వాపోతున్నారు. ప్రత్తిపాడు మార్కెట్‌లో బంగినపల్లి, చెరకురసం, పాపారావు గోవా, సువర్ణరేఖ, కొత్తపల్లి కొబ్బరి, నీలం తదితర రకాలు పరక (13 కాయలు) రూ.150కే లభించడంతో మామిడి ప్రియులు కొనుగోలుకు ఎగబడుతున్నారు.



మామిడి పండ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

నష్టాల ఊబిలో మామిడి రైతులు

- తగ్గిన ధర, దిగుబడులు
- నాణ్యతపై అకాల వర్షాల ప్రభావం
- చీడపీడలతో పెరిగిన పెట్టుబడులు
- సగానికి సగం తగ్గిన ఎగుమతులు
- కొనుగోలుకు రాని ఇతర రాష్ట్రాల వ్యాపారులు

తొండంగి, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ తీపి అందించే మధుర ఫలం రైతులకు మాత్రం చేదు మిగిల్చింది. అంతంతమాత్రంగా ఉన్న దిగుబడులకు అకాల వర్షాలు తోడు కావడంతో దాని ప్రభావం కాయల నాణ్యతపై పడింది. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి ఏటా వచ్చే వ్యాపారులు రావడం మానేయడంతో ఎగుమతులు సగానికి సగం తగ్గాయి. ధర కూడా అంతంతమాత్రంగానే ఉండడంతో మామిడి రైతులు తీవ్ర నష్టాలను చవి చూస్తున్నారు. తొండంగి మండలంలోని బెండపూడి, పరిసర ప్రాంతాల నుంచి రసాలు, సువర్ణరేఖ, బంగినపల్లి వంటి రకాలు ఏటా పదివేల టన్నులకు పైబడి ఎగుమతులు జరిగేవి. ఈ ఏడాది అవి సగానికి సగం తగ్గాయి. వ్యాపారులు ఎక్కువ మంది రాకపోవడంతో వీటిని స్థానిక మార్కెట్లకు తరలిస్తున్నారు. మరికొందరు రైతులు స్థానిక వ్యాపారుల సహాయంతో ఒడిశా, బెంగాల్ వంటి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ ఏడాది ఐదు వేల టన్నుల ఎగుమతి కూడా కష్టమేనంటున్నారు. ఇక మామిడి ధరలు గణనీయంగా తగ్గాయి. నాణ్యమైన కాయలైతే టన్ను రూ.40 వేల వరకు పలుకుతున్నాయి. తక్కువ నాణ్యత కలిగిన కాయల ధర రూ.30వేల నుంచి రూ.35వేల మధ్య వుంది. సువర్ణరేఖ, బంగినపల్లి ధరలు కూడా ఇంచుమించు ఇదే రీతిలో ఉండడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు.



మామిడి కాయలను లారీలో ఎగుమతి చేస్తున్న దృశ్యం



మామిడి కాయలను గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం



వర్సిటీ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

రివ్యూ అని చెప్పి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు

జేఎన్టీయూకే యూసీఈకే కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన.. వర్సిటీ ఆవరణలో ధర్నా.. మానసికంగా కుంగదీస్తున్నారని ఆవేదన

జేఎన్టీయూకే, మే 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలోని యూసీఈకే కాంట్రాక్ట్ అధ్యాపకులకు వర్సిటీ అధికారులు, విభాగాధిపతులు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించడంపై వారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నాకు దిగారు. అనంతరం యూసీఈకే సమావేశ హాలు, ప్రిన్సిపాల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. యూసీఈకే, యూసీఈఎన్, వర్సిటీలో సుమారు 140 మందికి పైగా కాంట్రాక్ట్ అధ్యాపకులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. గత 20 ఏళ్లుగా సేవలు అందిస్తున్న ఒప్పంద అధ్యాపకులను సమీక్ష (రివ్యూ) అని చెప్పి పిలిచి యూసీఈకే సమావేశ హాలులో ఇంటర్వ్యూలు నిర్వహించడంపై వారు నిరసన తెలిపారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ తమ సర్వీసును ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేస్తున్నారన్నారు. ఈ ఏడాది మాత్రం ఉద్దేశ్యపూర్వకంగానే సమీక్ష పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహించి మానసికంగా కుంగదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.110 ప్రకారం ఇంక్రిమెంట్ ఇవ్వలేదని, జీవో నెం.2 ప్రకారం మినిమం టైం స్కేల్ అమలు చేయట్లేదన్నారు. విద్యార్థులు 100 శాతం పాస్ కావడానికి, కళాశాల న్యాక్, ఎన్‌బీఏ గుర్తింపు పొందడంలోను తమ కృషి ఎంతో ఉందన్నారు. తమ విధులకు 14 రోజులు విరామం ఇచ్చి వేతనంలో కోత విధిస్తూ అన్యాయం చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఇంటర్వ్యూలు నిర్వహించకుండా న్యాయం చేయాలని, వర్సిటీ అధికారులు సొంత నిర్ణయాలు తీసుకోకుండా ప్రభుత్వ జీవోల ప్రకారం పాలన చేయాలని కోరారు. యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.మోహన్‌రావుతో కాంట్రాక్ట్ అధ్యాపకులు చర్చలు జరిపినా సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై యూసీఈకే ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా... విభాగాల వారీగా ఒప్పంద అధ్యాపకులకు రివ్యూలు మాత్రమే నిర్వహిస్తామన్నారు. కాగా కాంట్రాక్ట్ అధ్యాపకులు తమ సమస్యలను పరిష్కరించాలని వైస్ చాన్సలర్ పేషీ వద్ద సోమవారం సాయంత్రం నుంచి రాత్రి 8.30 గంటల వరకు నిరసన తెలిపారు. అయినా అధికారుల నుంచి ఎటువంటి స్పందనా లేదు.



కాంట్రాక్ట్ అధ్యాపకులతో మాట్లాడుతున్న యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మోహన్‌రావు

ప్రశాంతంగా ఈఏపీసెట్ ఇంజనీరింగ్ పరీక్ష

4,385 మంది హాజరు

జేఎన్టీయూకే, మే 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఏపీఈఏపీసెట్-2025 ఇంజనీరింగ్ ఆన్‌లైన్ పరీక్షలు సోమవారం కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగాయని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లకు కలిపి మొత్తం 4,523 మంది విద్యార్థులకు 4,385 మంది హాజరు కాగా 138 మంది పరీక్షలు రాయలేదన్నారు.

కాకినాడ జిల్లాలోని 5 కేంద్రాల్లో ఉదయం సెషన్‌లో 899 మందికి 862 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 910 మందికి 882 మంది హాజరయ్యారన్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లకు కలిపి మొత్తం 1,906 మంది విద్యార్థులకు 1,855 మంది హాజరుకాగా 51 మంది గైర్హాజరయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లలో 808 మంది విద్యార్థులకు 786 మంది హాజరు కాగా 22 మంది గైర్హాజరయ్యారు. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు మంగళవారం ఉదయం సెషన్‌తో ముగుస్తాయని, బుధవారం ప్రాథమిక కీ విడుదల చేస్తామని కన్వీనర్ సుబ్బారావు చెప్పారు.

ఎస్పీ భరోసా!



వృద్ధురాలితో మాట్లాడుతున్న కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం గైగోలుపాడుకు చెందిన 80 ఏళ్ల సలగాల లక్ష్మీకాంతమణి గత నెల 30న తనకు జరిగిన అన్యాయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అక్కడ న్యాయం జరగకపోవడంతో సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వచ్చింది. నడవలేని స్థితిలో వున్న ఆమె వద్దకు ఎస్పీ జి.బిందుమాధవ్ స్వయంగా వెళ్లి అర్జీని పరిశీలించారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. దాంతో ఆమె కృతజ్ఞతాభావంతో వెనుతిరిగింది.



ర్యాంకర్లను అభినందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

ఏయూ డిగ్రీ ఫలితాల్లో 'ఆదిత్య' విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

కాకినాడ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ ఫలితాల్లో వివిధ విభాగాల్లో 1, 2, 3 ర్యాంకులతో పాటు మొత్తం 12 ఉత్తమ ర్యాంకులు సాధించినట్టు ఆదిత్య డిగ్రీ కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి తెలిపారు. బీసీఏ విభాగంలో దున్నా ధనలక్ష్మి 9.53 సీజీపీఏ పాయింట్లతో 1వ ర్యాంకు, అంజూర్ పావని 9.51 సీజీపీఏ పాయింట్లతో 2వ ర్యాంకు, బొడుపు శిరీష, గంగు రిపిక 9.50 సీజీపీఏ పాయింట్లతో 3వ ర్యాంకు సాధించారన్నారు. బీబీఏ విభాగంలో కొరిపోలు మహిత 2వ ర్యాంకు, వానపల్లి మౌనిక, జి.వెంకటసాయికీర్తి 3వ ర్యాంకు పొందారు. బీఎస్సీలో మండల యమున 1వ ర్యాంకు, సత్తి మోని కవిశాల్ 3వ ర్యాంకు, బీకాంలో హరిప్రియ 2వ, పి.పల్లవి 3వ ర్యాంకు సాధించారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు 15, 120 క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సాధించారు. అత్యధిక సీజీపీఏ పాయింట్లతో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి సుగుణారెడ్డి అభినందించారు.



ఒప్పందం కుదుర్చుకుంటున్న ఆవుల్ టెక్నో, ఐకార్ సంస్థల ప్రతినిధులు

పొగాకు సాగులో సుస్థిరతను ప్రోత్సహించేందుకు

ఆవుల్ టెక్నోతో ఐకార్ ఎంవోయూ

రాజమహేంద్రవరం రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): పొగాకు సాగులో సుస్థిరతను ప్రోత్సహించేందుకు చేపట్టిన వ్యూహాత్మక చర్యగా హైదరాబాద్ కేంద్రంగా వున్న టెక్నాలజీ అభివృద్ధి సంస్థ ఆవుల్ టెక్నోతో ఎంవోయూపై సంతకాలు చేసినట్టు ఐకార్ సంస్థ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్ తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా ఫ్లూక్యూర్డ్ వర్జీనియా పొగాకు ఆకులను ఆరబెట్టే ప్రక్రియలో వినియోగించేందుకు హ్యూమిడిటీ కంట్రోల్‌తో కూడిన లాట్ ఎలక్ట్రిక్ హాట్ ఎయిర్ చాంబర్‌ను అభివృద్ధి చేసి, ప్రయోగాత్మకంగా పరిశీలిస్తామన్నారు. కలప వినియోగం తగ్గించడం, కర్బన ఉద్గారాలను నియంత్రించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు సంస్థ చేస్తున్న కృషిని ప్రస్తావించారు. ఇది భారతదేశ పర్యావరణ లక్ష్యాలకు అనుగుణంగా వుందన్నారు. ఆవుల్ టెక్నో సహకారంతో పొగాకు పరిశ్రమలో వ్యవసాయ ఇంజనీరింగ్ విధానాలతో కూడిన యాంత్రీకరణ దిశగా అడుగులు వేస్తూ సంప్రదాయంగా ఆరబెట్టే పద్ధతులకు బదులు శుద్ధమైన, పర్యావరణహితమైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తామని శేషుమాధవ్ చెప్పారు.

జాతీయ స్థాయి ఉపాధ్యాయ శిక్షణ మెంటార్‌గా సుసత్యరేఖ

రాజమహేంద్రవరం సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఉపాధ్యాయ శిక్షణ మెంటార్‌గా తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు మేకా సుసత్యరేఖ ఎంపికయ్యారు. ప్రధానమంత్రి మోదీ మానసపుత్రిక న్యూ ఎడ్యుకేషన్ పాలసీ-2020, వికసిత్ భారత్-2047 అభియాన్‌లో భాగంగా ప్రతిష్టాత్మకమైన జాతీయ మెంటరింగ్ మిషన్ ఏర్పాటైంది. బోధనా రంగంలో సృష్టించిన నూతన ఒరవడి, సాంకేతికరంగ నిపుణులైన ఉపాధ్యాయులను జాతీయస్థాయిలో ఎంపిక చేసి ఒక బృందంగా ఏర్పాటుచేశారు. ఈ మిషన్‌లో భాగస్వాములు కావాల్సిందిగా సుసత్యరేఖను ఆహ్వానించారు. జాతీయ ఉపాధ్యాయ మండలి, ఎన్‌సీఈఆర్‌టీ సంయుక్త ఆధ్వర్యంలో సుసత్యరేఖ జూన్ నుంచి ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా సుసత్యరేఖ మాట్లాడుతూ జాతీయ మెంటరింగ్ మిషన్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవడం ద్వారా ఉపాధ్యాయ శిక్షణ తీసుకుంటున్న వారెవరైనా పాల్గొనవచ్చునని తెలిపారు.

టీచింగ్ ఎట్ ద రైట్ లెవెల్ (తరల్) రాష్ట్ర స్థాయి శిక్షణకు రాజమహేంద్రవరం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుంచి వరాహగిరి కృష్ణమోహన్, ధాన్యంపాకలు మునిసిపల్ స్కూల్ నుంచి సిద్ధనాతి శ్రీనివాస్‌లను ఎంపిక చేసినట్టు సమగ్ర శిక్షా జిల్లా అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ ఎ.గౌరీశంకరరావు తెలిపారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో ఏలూరు జిల్లా అగిరిపల్లిలోని హీల్స్ పేరడైజ్ పాఠశాలలో 3,4,5 తరగతులకు సంబంధించి విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు సాధించేందుకు ఈ శిక్షణ జరుగుతుంది.



సుసత్యరేఖ

సరదా.. చంపేస్తోంది!

- గోదావరి నదిలో స్నానాలకు దిగి గల్లంతవుతున్న యువకులు
- గాలింపు చర్యల్లో విగతజీవులుగా తేలుతున్న ఘటనలు
- ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల వల్లే ఇంత అనర్థం



సలాదివారిపాలెం వద్ద ఎనిమిది మంది యువకులు గల్లంతైన ప్రదేశం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

వేసవితాపం నుంచి ఉపశమనం పొందడాని కో.. సరదాగా నదీస్నానం చేయాలనే ఆకాంక్షతో నో.. గోదావరి నదిలోకి వెళ్లి కొందరు యువకులు ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా సరదాగా స్నేహితులతో కలిసి గోదావరి స్నానానికి వెళ్లి తాజాగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధి సలాదివారిపాలెం వద్ద గౌతమీ నదిలో ఎనిమిది మంది యువకులు సోమవారం గల్లంతయ్యారు. గత కొంతకాలం నుంచి కోనసీమ జిల్లాలోని గౌతమీ, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయల్లో తరచూ ఈ తరహా ఘటనల్లో అనేకమంది యువకులు, వ్యక్తులు గల్లంతై విగతజీవులుగా మారుతున్నారు. ముఖ్యంగా గోదావరి నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా తవ్వడం వల్ల ఎక్కడికక్కడే గోదావరి నదీ ప్రవాహ వేగాలు మారడం, లోతులు తెలియకపోవడం, ఎక్కడ గొయ్యి ఉందో తెలియని పరిస్థితుల్లో సరదాగా స్నానానికి వెళ్లే వారు విగతజీవులవుతున్నారు.

గతంలో జరిగిన సంఘటనలెన్నో...

సలాదివారిపాలెంలో ఎనిమిది గల్లంతైన వారి కోసం అధికారులు గాలింపు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోనసీమ జిల్లా పరిధిలో ఇటీవల, గతంలోను జరిగిన కొన్ని సంఘటనలు ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఈ ఏడాది ఏప్రిల్ 5న కపిలేశ్వరపురం మండలంలోని కేదార్లంకలో స్నానానికి వెళ్లి కొత్తపేటకు చెందిన రొట్టా దుర్గాప్రసాద్ (21), ఈనెల 6న వీధివారిలంకలో మండపేటకు చెందిన దాసరి సాయిరామ్ (28), మొండెం రాంబాబు (30)లు గల్లంతై మృత్యువాత పడ్డారు. అలాగే గతంలో ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకలో కూడా నదిలో పలువురు యువకులు గల్లంతయ్యారు. అదేవిధంగా గతంలో రాజమహేంద్రవరం సమీపంలో దేవీపట్నం లో జరిగిన లాంచీ ప్రమాదంలో 46 మంది మృ త్యువాత పడిన సంఘటన కళ్లెదుట నుంచి చెరగకముందే 2018 జూలై 14న ఐ.పోలవరం మండలం పశువుల్లంక మొండివద్ద గోదావరిలో జరిగిన పడవ మునిగిన ఘటనలో ఎనిమిది మంది గల్లంతయ్యారు. వారిలో ఐదుగురి ఆచూకీ లభ్యం కాగా ముగ్గురు ఆచూకీ అప్పటి నుంచి లభ్యం కాలేదు. అయితే వీరంతా కమిని శివారు సలాదివారి పాలేనికి చెందిన విద్యార్థులే. కాగా 1993 మధ్యకాలంలో ఐ.పోలవరం మండలం కేశనకుర్రు వద్ద ఇదే గోదావరిపాయలో పడవ మునిగి కొంత మంది మృత్యువాత పడిన విషయం విదితమే. ఆ తర్వాత పడవ దాటింపు విషయంలో కొంత కాలం జాగ్రత్తలు పాటించడం జరిగింది. ఆ సమయంలో పశువుల్లంక మొండి వద్ద జరిగిన పడవ ప్రమాదానికి పరిమితికి మించి వాహనాలు, సైకిళ్లు పెట్టడం వల్లే ఆనాడు ప్రమాదం జరగడానికి కారణంగా అధికారులు గుర్తించారు.

ఇటీవలే ఐదుగురు విగతజీవులై..

ఇటీవల తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడిలో గోదావరిలో స్నానానికి దిగిన ఐ దుగురు యువకులు గల్లంతై విగతజీవులయ్యారు. ఇక్కడ కూడా వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాల కారణంగా ఏర్ప డిన గోతుల్లో మునిగిపోయారు. గోదావరి నదుల్లో ఇష్టానుసారంగా ఎక్కడికక్కడే ఇసుక తవ్వకాలు అనుమతులతో సంబంధం లేకుండా లోతుగా తవ్వేయడం వల్ల నదీపాయలో ఎక్కడ అడుగు వేస్తే అక్కడ గల్లంతయ్యే పరిస్థితులు కోనసీమ జిల్లాలోని నదీపాయల్లో అడుగడుగునా దర్శనమిస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు వచ్చే వ్యక్తులకు అవగాహన లేకపోవడంతో స్నానాలకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.



కాకినాడ జగన్నాథపురంలోని క్రాంతి, పాల్ ఇంటి వద్ద విషాదంలో బంధుమిత్రులు

పాపం వారిది.. శాపం వేరొకరికి!

- ఆటోనగర్ జంక్షన్ వద్ద అధికారులు, పోలీసుల వసూళ్లు
- కంగారు పడుతున్న లారీ డ్రైవర్లు.. అటుపై ప్రమాదాలు



పోలీసులు తనిఖీలు చేయడానికి ముందు గల ప్రదేశం

రాజమహేంద్రవరం, మే 26 (ఆంధ్రజ్యోతి): యంత్రాంగం అలసత్వం పరోక్షంగా నలుగురు చనిపోవడానికి, ఒకరు నిందితుడిగా మారడానికి, విద్యార్థి అనాథగా మిగలడానికి కారణ మైంది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆటోనగర్ జంక్షన్‌ను రోడ్డు రవాణా అధి కారులు, పోలీసులు చెకింగ్ అడ్డాగా మార్చుకున్నారు. రేయింబవళ్లు తేడా లేకుండా వసూళ్లు చేస్తూ చలాన్లు రాస్తారు. దివాన్ చెరువు వైపు నుంచి వచ్చేటప్పుడు సరిగ్గా మలుపు తిరిగిన తర్వాత యూనిఫాం సర్వీసు వారు కనిపిస్తారు. ఆ మలుపు నుంచి 70 మీటర్ల దూరంలోనే వీళ్లు ఉండడంతో వాహనదారులు.. ముఖ్యంగా లారీల డ్రైవర్లు కంగారుపడుతూ ఉంటారు. సోమవారం జరిగిన ప్రమాదం కూడా దాని పర్యావసానమే. బొగ్గు లోడుతో విశాఖపట్నం నుంచి మహారాష్ట్ర వెళ్తున్న లారీ డ్రైవరు రోడ్డు రవాణా సిబ్బందిని చూసి ఒక్కసారిగా కంగారుపడి (బొగ్గు లోడుకు తగిన అనుమతులు లేవని చెబుతున్నారు) సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో 60 మీటర్ల దూరం నుంచి రోడ్డుపై చారను పెట్టుకుంటూ వెళ్లి కారును ఢీకొని మరొక 10మీటర్లు రోడ్డు కిందకు తోసుకుపోయింది. ఇదే ప్రదేశంలో 3 రోజుల క్రితం ఒక లారీ డ్రైవరు పోలీసులను చూసి సడెన్ బ్రేక్ వేయగా వెనుక వచ్చే కారు ఆ లారీని వెనుక నుంచి ఢీకొందని,సెటిల్‌మెంట్ చేసి పంపేశారని స్థానికులు చెప్తున్నారు. ఇదే ప్రదేశంలో గత నెల రోజుల్లో ఇది మూడో ప్రమాదమని అంటున్నారు. రాత్రి వేళల్లో గస్తీ అంటూ లారీల వద్ద వసూళ్ల కోసం ఇక్కడే కాపు కాస్తుంటారు. ఒక్కసారిగా పోలీసులు కనబడడంతో లారీ డ్రైవర్లు కంగారు పడుతున్నారు. తనిఖీ వారికి డబ్బులు ఇవ్వడం కోసం కొందరు లారీ డ్రైవర్లు ఉన్న పళంగా బ్రేకును నొక్కి రోడ్డు వారకు నిలుపుతున్నారు. ఆ సమయంలో వెనుక వచ్చే వాహనాలు కంట్రోల్ కావడం ఇబ్బందవుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారి ఆర్ అండ్ బీ పరిధిలోకి వస్తుంది. గామన్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుగా పిలుస్తారు. కొవ్వూరు నుంచి దివాన్ చెరువు వరకూ 14 కిలోమీటర్లు ఉంటుంది. ఇటీవల పాస్టర్ ప్రవీణ్ మృతిచెందిన ప్రదేశం ఇప్పుడు ప్రమాదం జరిగిన ప్రదేశానికి కిలోమీటరు మాత్రమే ఉంటుంది. ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నా నలుగురు చనిపోయే వరకూ యంత్రాంగం కళ్లు తెరవకపోవడంపై ప్రజాగ్రహం వ్యక్తమవుతోంది.

31న ముమ్మిడివరంలో సీఎం పర్యటన

ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు



ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

ముమ్మిడివరం, మే 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 31న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బంగారు కుటుంబం కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవం, పలు శంకుస్థాపనలు చేయనున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై సోమవారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ సమీక్షించారు. ముమ్మిడివరం మండలం సీహెచ్.గున్నేపల్లిలోని ఓఎన్జీసీ స్థలాన్ని ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం హెలిప్యాడ్ ఏర్పాటుకు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాకు వివరాలు వివరించారు. 31న ముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలతో పాటు పురోగతిలో ఉన్న పలు కార్యక్రమాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలన చేయనున్నట్టు పరిశీలించారు. కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలో ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యంతో జిల్లా స్థాయిలో ప్రారంభించే పీ4 కార్యక్రమ సభ, బహిరంగ వేదిక ఏర్పాట్లను అధికారుల బృందం పరిశీలించింది. చెయ్యేరు సభావేదిక సమీపంలోని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రూ.9లక్షల 80వేలతో చేస్తున్న పూడికతీత, చెరువు అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. చెరువు పూడికతీత, అభివృద్ధి పనులను సీఎం నిశితంగా పరిశీలించనున్నట్టు కలెక్టర్ వివరించారు. చెయ్యేరు గ్రామ అభివృద్ధి, గ్రామంలో వివిధ ప్రభుత్వ పథకాల అమలుతీరు, భౌగోళిక విస్తీర్ణం, జనాభా తదితర వివరాలను సేకరించి సిద్ధంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారిణి శాంతలక్ష్మిని ఆదేశించారు. ఏర్పాట్లకు సంబంధించి వివిధ శాఖల అధికారులకు ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. ముఖ్యమంత్రి సీహెచ్.గున్నేపల్లిలోని ఓఎన్జీసీ సైట్‌లో హెలికాప్టర్ ల్యాండింగ్ అయిన తరువాత అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో చెయ్యేరు చేరుకోనున్నట్టు సమాచారం. పరిశీలనలో ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, పంచాయతీరాజ్ ఎస్ఈ పి.రామకృష్ణారెడ్డి, ఆర్డీవో కె.మాధవి, నాయకులు దాట్ల రాజేష్, చెల్లి అశోక్, ఎంపీడీవోలు శ్రీవెంకటాచార్య, వెంకటాచలం, తహశీల్దార్ సునీల్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ గోపాలకృష్ణ, సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్,ఏపీవో చంద్రమోహన్ ఉన్నారు.

ప్రియుడు మోసం చేశాడని
యువతి ఆత్మహత్య

సూసైడ్ నోట్ స్వాధీనం



సునీత (ఫైల్)

ఉప్పలగుప్తం, మే 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో ఒక యువతి ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. చావుకు కారణాలను వివరిస్తూ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.యానాంకు చెందిన మట్ట సునీత (24), అదే గ్రామానికి చెందిన ప్రస్తుత గ్రామపంచాయతీ సభ్యుడు పెట్టా మురళి చాలాకాలంగా ప్రేమలో ఉన్నారు. ఇద్దరి మధ్య గొడవ జరిగి కొంతకాలం దూరంగా ఉన్నారు. కాగా మురళికి వేరొకరితో వివాహమైంది. అతడికి ఇద్దరు పిల్లలున్నారు. అనంతరం మళ్లీ సునీతకు మురళీ చేరువయ్యాడు. రెండో వివాహం చేసుకుంటానని సునీతను నమ్మించి ఆమెతో వివాహేతర బంధం కొనసాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న సునీత కుటుంబ సభ్యులు ఆమె మందలించి మొబైల్‌ను లాక్కున్నారు. ఇటీవల మురళీ భార్యకు ఈ విషయం తెలియడంతో కుటుంబంలో గొడవలు ప్రారంభమయ్యాయి. ఆమె భర్తను నిలదీసింది. దీంతో మురలీ ఇక మన బంధం కొనసాగదని సునీతకు తెగేసి చెప్పాడు. ఈ కారణంగా మనస్తాపానికి గురైన సునీత చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి నకులుడు ఫిర్యాదుమేరకు మురళీపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సీహెచ్.రాజేష్ తెలిపారు.

హత్యాయత్నం కేసులో
వ్యక్తికి ఏడేళ్ల జైలు

రూ.3 వేల జరిమానా విధింపు

నిడదవోలు, మే 26 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష పడింది. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం శెట్టిపేటలో 2016లో అడపా కోట సత్యనారాయణ తన దూరపు బంధువైన కానూరు కోట సత్యనారాయణకు మధ్య పాత కక్షల నేపథ్యంలో కత్తితో దాడి చేసి చంపేందుకు యత్నించగా కేసు నమోదైంది. ఈ మేరకు సోమవారం నిడదవోలు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జీవీఎల్ సరస్వతి తీర్పు చెప్పారు. నేరం రుజువు కావడంతో అడపా కోట సత్యనారాయణకు 7 సంవత్సరాల జైలు, రూ.3 వేల జరిమానా విధించినట్టు నిడదవోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ తెలిపారు. అప్పటి సీఐ మద్రి బాలకృష్ణ నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కాకులపాటి వెంకటరమణ వాదించగా, ఎస్ఐ కె.జగన్మోహనరావు, కానిస్టేబుల్ సీహెచ్.కరుణాకరరావు సహకరించారు.

గంజాయితో ఏడుగురి అరెస్టు

రూ. 8.16లక్షల విలువైన సరుకును స్వాధీనం చేసుకున్న జగ్గంపేట పోలీసులు



గంజాయితో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

జగ్గంపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): కారులో గంజాయిని తరలిస్తున్న ఏడుగురిని కాకినాడ జిల్లా జగ్గంపేట పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిబాబు జగ్గంపేట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం వెల్లడించారు. విశాఖపట్నం గోపాలపురానికి చెందిన ఎస్కే మస్తాన్‌వలీ, అనామిక, అల్లిపురానికి చెందిన ఎస్‌కే.షరీఫ్, నర్సీపట్నం బలిఘట్టం ప్రాంతానికి చెందిన కె.నాయుడు, సీహెచ్.సతీష్ ఒడిసాలోని చిత్రకొండ వద్ద గంజాయిని కొనుగోలు చేశారు. మహారాష్ట్రలోని షిరిడీకి చెందిన ఒక వ్యక్తికి ఈ సరుకును అందజేయడానికి కారులో బయలుదేరారు. కాకి నాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనంలో 163.250 కిలోల గంజాయిని గుర్తించారు. దీని విలువ రూ. 8.16లక్షలు ఉంటుందని తెలిపారు. ఏడుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 2 కారులు, 8 ఫోన్లు, రూ.880 నగదు స్వాధీనం చేసు కున్నారు. వారిని పెద్దాపురం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు



రాయవరంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐ

రాయవరం, మే 26(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో నిందితులుగా ఉండి పరారీలో ఉన్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు తెలిపారు. కోనసీమ జిల్లా రాయవరం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఈ వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలతో రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ పర్యవేక్షణలో ఎస్ఐ డి.సురేష్‌బాబు సిబ్బందితో కలిసి సీతమ్మతోట వద్ద గంజాయి కేసులో నిందితులుగా ఉండి పరారీలో ఉన్న మండలంలోని పనలపూడి గ్రామానికి చెందిన పచ్చిమాల సురేష్, సోమేశ్వరం గ్రామానికి చెందిన పసుపులేటి బాలాజీ ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 450 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపర్చినట్టు తెలిపారు.

మాజీ మంత్రి ఇంట్లో దొంగతనం చేసిన నలుగురి అరెస్టు

కొవ్వూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కెఎస్.జవహర్ ఇంట్లో దొంగతనం చేసిన నలుగురిని అరెస్టు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల ప్రకారం.. గతనెల ఏప్రిల్ 28న తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జవహర్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళాలు వేసి తిరువూరు మండలం గానుగపాడు వెళ్లారు. మే 3న మొక్కలకు నీళ్లు పోయడానికి వీధి రాజు వచ్చాడు. ఇంటివెనుక వైపు తలుపులు తెరిచిఉండంతో జవహర్‌కు ఫోన్‌లో సమాచారం అందించాడు. జవహర్, ఆయన కుమారుడు కొత్తపల్లి ఆశిష్ అమృత్‌లాల్‌లు ఇంటికి వచ్చిచూడగా రూ.30 వేలు నగదు, రాడార్ వాచ్ 1, 32 ఇంచెస్ స్యామ్‌సంగ్ టీవి 1 దొంగతనం జరిగిందని గుర్తించారు. అమృత్‌లాల్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో, కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. దొంగతనానికి పాల్పడిన నలుగురు జంగారెడ్డిగూడెంకు చెందిన పోలవరపు నాగ దుర్గాప్రసాద్, దుగ్గిరాల శివరామకృష్ణ, కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన గుంటూరు నందీశ్వరుడు, శ్రీకాకుళం జిల్లా హిరా మండలం కొందరాగోలుకు చెందిన మంతెన చైతన్యలను సోమవారం కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి వద్ద అరెస్టు చేసి వారి నుంచి రూ.30 వేల నగదు, సామ్‌సంగ్ టీవి, 2మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ పేర్కొన్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన సీఐ విశ్వం, సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అభినందించారు.

స్ట్రాంగ్‌మెన్‌గా పవన్
స్ట్రాంగ్ ఉమెన్‌గా వందన

అమలాపురంలో ముగిసిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు



పోటీల్లో స్ట్రాంగ్‌మెన్ విన్నర్‌గా నిలిచిన జగన్‌కు షీల్డు అందజేస్తున్న నిర్వాహకులు



స్ట్రాంగ్ ఉమెన్ విన్నర్‌గా నిలచిన వందన

అమలాపురం టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీలు సోమవారం ముగిశాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సర్‌సీవీ రామన్ స్కూలు ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీల్లో పలు విభాగాల్లో గెలుపొందిన 24 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక చేసినట్టు అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడికి చెందిన ఎం.జగన్ స్ట్రాంగ్‌మెన్ విన్నర్‌గా నిలవగా రన్నర్‌గా కె.శివకుమార్ (కాకినాడ)లు నిలిచి షీల్డులు అందుకున్నారు. స్ట్రాంగ్ ఉమెన్ విన్నర్‌గా అమలాపురానికి చెందిన అంతర్జాతీయ క్రీడాకారిణి పి.వందన నిలవగా, రన్నర్‌గా రామచంద్రపురానికి చెందిన బి.అఖిల నిలిచారు. స్ట్రాంగ్ మాస్టర్ విన్నర్‌గా డి.నాగేశ్వరరావు (ద్రాక్షారామం), రన్నర్‌గా బి.అప్పన్న (అమలాపురం)లు షీల్డులు అందుకున్నారు. పవర్ లిఫ్టింగ్ పోటీల టీమ్ చాంపియన్ షిప్‌ను కాకినాడ దక్కించుకోగా రన్నర్‌గా అమలాపురం జట్టు నిలిచింది. ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో గెలుపొందిన 24 మంది క్రీడాకారులను జూన్‌లో ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక చేశారు. ఆయా పోటీల విజేతలకు నిర్వాహకులు యెనుముల కృష్ణపద్మరాజు, ఆశెట్టి ఆదిబాబు, నూదా గణపతి, రవణం వేణుగోపాల్, దొమ్మేటి వెంకటరమణ, చిక్కం రాజబాబు, డాక్టర్ కొప్పుల నాగమానస షీల్డులు,పతకాలందించారు.

ప్రధాన ద్వారాన్ని బద్దలుగొట్టి.. సొత్తంతా కొల్లగొట్టి!

పెనుగుదురులో ఓ ఇంట్లో భారీ దొంగతనం

రూ.30లక్షల విలువైన బంగారం, వెండి మాయం



బీరువాలో సొత్తును కాజేసి చిందరవందరగా పడేసిన దొంగలు

కరప, మే 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం పెనుగుదురులోని ఒక ఇంట్లో ఆదివారం రాత్రి భారీ దొంగతనం జరిగింది. ఇంట్లో ఎవరూలేరని తెలుసుకున్న దొంగలు ఇంటి ప్రధాన ద్వారాన్ని బద్దలుగొట్టి 3 బీరువాల్లోని సొత్తును దోచుకుపోయారు. ఈ ఘటనలో ఏకంగా రూ.30లక్షలు విలువచేసే బంగారు ఆభరణాలు, 2 కిలోల వెండి, రూ.1లక్ష నగదు అపహరణకు గురైనట్టు తెలుస్తోంది. కరప పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెనుగుదురు-పాతర్లగడ్డ ప్రధాన రహదారిని చేర్చి ఉన్న ఒక ఇంట్లో సుంకర తిరుపతిరావు, వెంకటలక్ష్మి అనే వృద్ధ దంపతులు నివాసముంటున్నారు. తిరుపతిరావు గుండెజబ్బుతో బాధపడుతున్నాడు. వారిరివురి కుమారులు చెన్నై, హైదరబాద్‌లలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తిరుపతిరావు ఇటీవలే కాకినాడలోని ఒక ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకున్నాడు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ రావాల్సిందిగా కుమారులు కోరడంతో ఈనెల 17న భార్య వెంకటలక్ష్మితో కలిసి అక్కడకు వెళ్లారు. కాగా అతని ఇంటి పక్కనే నివాసముంటున్న విశ్రాంత ఎంఎస్‌వో సూర్యభాస్కర్ సోమవారం ఉదయం తిరుపతిరావు ఇంటి ప్రధాన ద్వారం తెరిచి ఉండడం చూసి వెంటనే తిరుపతిరావుకు ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో షాక్‌కు గురైన తిరుపతిరావు కుమారులు ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదుచేసి హైదరాబాద్ నుంచి పెనుగుదురు గ్రామానికి బయలుదేరారు. కాకినాడ రూరల్ ఇన్‌చార్జ్ సీఐ పెద్దిరాజు, క్రైమ్ సీఐ కృష్ణ, ఎస్ఐ వినయ్‌ప్రతాప్, కరప ఎస్ఐ తోట సునీతలు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. కాకినాడ నుంచి క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలను సేకరించింది. దొంగలు ఇంట్లోని మూడు బెడ్‌రూమ్‌లలో ఉన్న 3 బీరువాలను తెరిచి దొరికినకాడికి దోచుకున్నారు. దేవుడి గదిలోని వెండి వస్తువులు కూడా అపహరించుకుపోయారు. తిరుపతిరావు గదిలో ఉన్న బీరువాలోనే అపహరణకు గురైన బంగారు ఆభరణాలు, వెండి, నగదు ఉన్నట్టు బాధిత బంధువుల ద్వారా తెలిసింది. పక్కనే ఉన్న ఐరన్ లాకర్‌ను కూడా తెరవడానికి దొంగలు విశ్వప్రయత్నంచేసి విఫలమయ్యారు. పెద్దకుమారుడికి చెందినదిగా చెప్పుకుంటున్న ఆ ఇనుప లాకర్ కూడా తెరిచి ఉంటే మరింత సొత్తు చోరీకి గురై ఉండేదని సమాచారం. ఘటనపై ఎస్ఐ సునీత బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

ఇద్దరికి గాయాలు



మృతిచెందిన లోవరాజు

రాజవొమ్మంగి, మే 26 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం ఏబీకాలనీ- కొమరాపురం గ్రామాల మధ్య సోమవారం రెండు బైక్‌లు ఢీన్న ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. జడ్డంగి ఎస్ఐ చిన్నబాబు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం జడ్డంగి గ్రామం నుంచి పాత్రికేయుడు ముడుసు విజయ్‌కుమార్ తన పిన్నిని వాతంగి గ్రామానికి మోటారు బైక్‌పై తీసుకుని వెళ్లి తిరిగి జడ్డంగి వైపు వస్తున్నాడు. అలాగే చిలికింత గ్రామానికి మోటారుబైక్‌పై పాకల లోవరాజు, కొచ్చా వీర్రాజు వెళ్తుండగా ఏబీ కాలనీ - కొమరాపురం మధ్య రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పాకల లోవరాజు అక్కడికక్కడే మరణించాడు. గాయాలపాలైన విజయ్‌కుమార్, కొచ్చా లోవరాజును జడ్డంగి ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి ఏలేశ్వరం రిఫర్ చేశారు. లోవరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల తరలించినట్టు, దీనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

లారీని ఢీకొని యువకుడి మృతి



పెద వీరన్న (ఫైల్‌ఫొటో)

పెరవలి, మే 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా తీపర్రుకు చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తీపర్రుకు చెందిన కుంపట్ల పెద వీరన్న (24) ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం పని నిమిత్తం కాకరపర్రు వెళ్లి రాత్రి 10.30 సమయంలో స్వగ్రామానికి మోటారుసైకిల్‌పై వస్తుండగా కాకరపర్రు వంతెన సమీపంలో వేదుల రామ్మూర్తి ఆశ్రమం వద్ద ప్రమాదానికి గురయ్యాడు. రోడ్డుపక్కన ఆగి ఉన్న లారీ ఒక్కసారిగా రోడ్డు మధ్యలోకి రావడంతో వెనుక భాగాన్ని బలంగా ఢీకొని తలకు తీవ్రగాయమై మృతి చెందాడు. మృతుడి తండ్రి కుంపట్ల వెంకటేశ్వరరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నాలుగేళ్లుగా పరారీ...
నలుగురి అరెస్టు

పిఠాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): సారా కేసుల్లో నాలుగేళ్లుగా పరారీలో ఉన్న నలుగురిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ శివరామరాజు తెలిపారు. 2021లో నమోదైన సారా విక్రయాలు, స్వాధీనం, తయారీ బట్టీల ధ్వంసం కేసుల్లో కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.దొంతమూరుకు చెందిన పంపన సూరిబాబు, చింతల నూకరాజు, కొత్తపల్లి మండలం శొంఠివారిపాకలుకు చెందిన కొమ్మనబోయిన గోవిందు, గు త్తుల సత్తిబాబు నిందితులు. వారు అప్పట్నుంచీ పరారీలో ఉన్నారు. ప్రత్యేక నిఘా ఉంచి సోమవారం అరెస్టు చేశారు. వారిని పిఠాపురం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు సీఐ శివరామరాజు చెప్పారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ

గొల్లప్రోలు, మే 26 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎన్.వెంకటేశ్వరరావు సోమవారం తనిఖీ చేశారు. అనంతరం అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ లక్ష్మణస్వామి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ వెంకటరావు వున్నారు.

పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ

చైర్‌పర్సన్‌గా దేవి

గౌరవ చైర్మన్‌గా పవన్‌కల్యాణ్

జీవో నెం.334 జారీ చేసిన ప్రభుత్వం



పిఠాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వాకపల్లి దేవి నియమితులయ్యారు. కమిటీలకు గౌరవ చైర్మన్లుగా ఎమ్మెల్యేలను నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు పిఠాపురం ఏఎంసీకి స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గౌరవ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, ఇతర సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం జీవో నెం.334 జారీ చేసింది. వీరు ఏడాది పాటు పదవుల్లో కొనసాగుతారు. చైర్‌పర్సన్ పదవిని ఎస్సీ మహిళకు కేటాయించగా జనసేనకు చెందిన వాకపల్లి దేవి, వైస్ చైర్మన్‌గా గాది రాజుబాబు నియమితులయ్యారు. సభ్యులుగా దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, దూళ్ల సీతారామయ్య, సైతన సత్యవేణి, కేతినీడి గౌరీనాగలక్ష్మి, కొల్లు గుర్రయ్య, నరాల అరుణకుమారి, పెదిరెడ్ల కనకలక్ష్మి, రొంగల జయదీప్, సాలా మంగాదేవి, ఉమ్మిడి అమలేశ్వరి, బస్సా సోమరాజు, కందా నాగేశ్వరరావు, నూతాటి ప్రకాష్, వ్యవసాయ శాఖ పిఠాపురం అసిస్టెంట్ డైరెక్టర్, పిఠాపురం కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్, నరసింగపురం పంచాయతీ సర్పంచ్, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి సభ్యులుగా నియమితులయ్యారు. వీరు త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

గతంలో మార్కెట్ కమిటీ సభ్యులుగా పదవీ రీత్యా పిఠాపురం మునిసిపల్ చైర్‌పర్సన్, నియోజకవర్గంలోని సొసైటీల్లో ఒక చైర్మన్ సభ్యులుగా ఉండేవారు. ఈసారి మునిసిపల్ చైర్మన్‌కు బదులుగా నరసింగపురం సర్పంచ్‌ను, పీఏసీఎస్‌ల్లో పిఠాపురం కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌ను సభ్యులుగా నియమించారు.



మంత్రి నాదెండ్లకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రేషన్ డీలర్ల సంఘ నాయకులు శ్రీనివాస్, కిషోర్

మంత్రి నాదెండ్లకు రేషన్ డీలర్ల అభినందన

సర్పవరం జంక్షన్, మే 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రేషన్ డీలర్ల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కోటిపల్లి శ్రీనివాస్, కాకినాడ రూరల్ మండల అధ్యక్షుడు సూరంపూడి కిషోర్ ఆధ్వర్యంలో రేషన్ డీలర్ల ప్రతినిధులు సోమవారం విజయవాడలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. రేషన్ దుకాణాల సరుకుల పంపిణీకి నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నాదెండ్లకు రేషన్ డీలర్ల సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. లబ్ధిదారులకు నిత్యావసరాలను రాయితీపై సక్రమంగా పంపిణీ చేస్తామన్నారు.





కాకినాడ సిటీ. రూరల్ నుంచి కడప వెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న టీడీపీ కాకినాడ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, కాకినాడ రూరల్ కో-కో-ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు

మహానాడుకు ఉత్సాహంగా పయనం

కాకినాడ సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పబ్బాపురంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న టీడీపీ మహానాడుకు సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో కాకినాడ నుంచి సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు సోమవారం బయల్దేరి వెళ్లారు. టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు జెండా ఊపి బస్సులు, కార్లను ప్రారంభించారు. నాయకులు తుమ్మల రమేష్, ఎంఎ తాజుద్దీన్, ఎస్కే రహీమ్, కొల్లాబత్తుల అప్పారావు, ఏవీడీ మెంటారావు, మల్లాడి గంగాధరం, బంగారు సత్యనారాయణ, మూగు రాజు, అమలకంటి బలరాం, రెడ్నం సత్తిబాబు, బలసాడి రంగారావు, పాలిక నాని, పొంగా బుజ్జి, గుమ్మళ్ల చిన్న, గెడ్డం పూర్ణ చంద్రశేఖర్, చింతలపూడి రవి, ఎరిపిల్లి రాము, వాసంశెట్టి చిట్టప్ప, చింతపల్లి తాతారావు, ఓలేటి పాండురంగ, కోడూరి పెద్ద, అంగాడి దుర్గారావు, తెప్పల రామలింగేశ్వరరావు, పెరుమాళ్ల బలరాం పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ నియోజకవర్గం టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో కడపలో జరిగే మహానాడుకి తరలి వెళ్లారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ కో-కోఆర్డినేటర్, రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) ఆధ్వర్యంలో రెండో ఓల్వో బస్సులు, 10 కార్లను కరణం గారి సెంటర్లోని పార్టీ కార్యాలయం వద్ద మాజీ జడ్పీటీసీ నురుకుర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్‌గౌడ్, మహిళా నాయకురాలు ఏటుకూరి నాగమణి జెండా ఊపి ప్రారంభించారు. సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు వెళ్లారు.



మంత్రి లోకేశ్‌తో ఎంపీ సతీష్‌బాబు

మహానాడు ఏర్పాట్ల పర్యవేక్షణలో

ఎంపీ సతీష్‌బాబు

కాకినాడ సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పబ్బాపురం సమీపంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న టీడీపీ మహానాడు ఏర్పాట్లను రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు సోమవారం పర్యవేక్షించారు. ఆయనతో పాటు రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ కేవీవీ సత్యనారాయణరాజు వున్నారు. ఈ వివరాలను ఎంపీ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.





సామర్లకోట, పెద్దాపురంల్లో యోగా శిక్షణలో పాల్గొన్న మున్సిపల్ ఉద్యోగులు

యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

పెద్దాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. యోగాంధ్రలో భాగంగా వెలమ కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన శిక్షణలో ఆయనతో పాటు మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు. కమిషనరు మాట్లాడుతూ ఆధునిక జీవనశైలితో ప్రజలు అనేక మానసిక, శారీరక రుగ్మతలకు గురవతున్నారన్నారు. యోగా, ధ్యానం సాధనతో వాటిని దూరం చేసుకోవచ్చన్నారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల సిబ్బందికి యోగా శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. యోగాసనాలు, వాటి వల్ల ప్రయోజనాలను వ్యాయామ ఉపాధ్యాయులు వివరించారు. మండలంలోని పది గ్రామాల సచివాలయాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో...

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీబొమ్మ సెంటరు వద్ద నిర్వహించిన యోగ శిక్షణలో మున్సిపల్ కమిషనరు శ్రీవిద్య మాట్లాడుతూ ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. మున్సిపల్ సిబ్బంది, మెప్మా రిసోర్స్‌పర్సన్లు యోగాసనాలు వేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జి.అరుణ తదితరులు పాల్గొన్నారు.



నర్సింగ్ సిబ్బందికి ఆధ్యాత్మిక అంశాలను వివరిస్తున్న అనంత శేషదాస్

'ఒత్తిడిని జయించాలి'


జీజీహెచ్ (కాకినాడ), మే 26 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఒత్తిడిని జయించడానికి ఆధ్యాత్మికతతో కూడిన స్ఫూర్తిదాయకమైన సందేశాలు ఉపకరిస్తాయని ఇస్కాన్‌కు చెందిన స్వామి అనంత శేషదాస్ అన్నారు. సోమవారం ఆయన జీజీహెచ్‌లోని నర్సింగ్ సిబ్బందికి ప్రత్యేకమైన ప్రేరణ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ, సిబ్బంది శ్రేయస్సు, వృత్తిపరమైన ధైర్యాన్ని పెంపొందించే లక్ష్యంతో కొనసాగుతున్న 30 పాయింట్ల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ సెషన్ నిర్వహిస్తున్నామన్నారు. సుమారు 50 మంది నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



గొప్ప సంఘ సంస్కర్త వెంకటరత్నంనాయుడు

సర్పవరం జంక్షన్, మే 26 (ఆంధ్రజ్యోతి): రఘపతి వెంకటరత్నంనాయుడు గొప్ప సంఘ సంస్కర్త అని విశ్రాంత డీఎంఈ డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు అన్నారు. వెంకటరత్నం నాయుడు 86వ వర్ధంతి సందర్భంగా బోట్ క్లబ్ ఆవరణలో గల ఆయన విగ్రహానికి వాకర్స్ సంఘం అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు, కార్యదర్శి దాసరి శ్రీధర్, ప్రసాద్ నాయుడు, సీహెచ్ సుబ్బారావు, రేలంగి బాపిరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమేశ్వరస్వామికి విశేష పూజలు



సామర్లకోట, మే 26 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న వేదమంత్రోచ్ఛారణలతో స్వామివారిని పంచ ద్రవ్యాలతో అభిషేకించారు. బాలాత్రిపురసుందరి అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో అలంకరించారు.


విద్యార్థులకు క్విజ్ పోటీలు

కాకినాడ సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా సోమవారం విశ్రాంత ఉపాధ్యాయుడు బి.సూర్యనారాయణ విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్ పోటీ నిర్వహించారు. కరెంట్ అఫైర్స్, దేశ రాజధానులు, దేశ నాయకుల ఫొటోలు గుర్తించడం వంటి అంశాలపైనా క్విజ్ పోటీ జరిపారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. సూర్యనారాయణ సొంత నగదుతో బహుమతులు కొనుగోలు చేసి విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఇన్‌చార్జి, ఉప గ్రంథాలయ అధికారి కె.కిషోర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇదేమి చోద్యం!

రుణాల రెన్యువల్‌కు ప్రామిసరీ నోటు

సొసైటీల నిర్వాకంపై రైతుల ఆందోళన


ప్రామిసరీ నోటు

ఒక రైతు నుంచి కరప పీఏసీఎస్ సిబ్బంది రాయించుకున్న ప్రామిసరీ నోటు

కరప, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) అధికారులు వడ్డీ వ్యాపారులను మించిపోయారు. పంట రుణాల రెన్యువల్ కోసం సొసైటీలకు వెళ్తున్న రైతులతో ప్రామిసరీ నోట్లపై బలవంతంగా సంతకాలు పెట్టించుకుంటున్నారు. వడ్డీ వ్యాపారుల మాదిరిగా ప్రవర్తిస్తున్న సిబ్బంది తీరు చూసి ఇదేమి చోద్యమంటూ రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధానాలతో రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న డీసీసీబీ అధికారుల తీరుపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీసుకున్న రుణాలను రెన్యువల్ చేయించుకుందామని సోమవారం పలువురు రైతులు కాకినాడ జిల్లా కరప సొసైటీకి వెళ్లారు. ఎటువంటి పత్రాలు అవసరం లేకుండా వెంటనే అప్పు తిరగేసే సిబ్బంది ఈసారి మాత్రం రెవెన్యూ స్టాంప్ అతికించిన ప్రామిసరీ నోటుపై సంతకాలు చేయాలని పట్టుబట్టడంతో వారు నివ్వెరపోయారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల ఆదేశాలంటూ సమాధానం ఇచ్చారని రైతులు తెలిపారు. లక్షలు విలువ చేసే పొలం డాక్యుమెంట్లు దగ్గర పెట్టుకుని కూడా ఈ ప్రామిసరీ నోట్లు రాయించుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సొసైటీల నుంచి రుణాలు తీసుకునేటప్పుడు మెంబర్ క్రెడిట్ లిమిట్ (ఎంసీఎల్) దరఖాస్తులో ప్రామిసరీ నోటు ఎలాగూ ఉంటుంది. అలాంటప్పుడు మళ్లీ ప్రత్యేకంగా ఈ ప్రామిసరీ నోటు ఎందుకు రాయించుకుంటున్నారో అధికారులకే తెలియాలి. డీసీసీబీ బోర్డు, త్రీమెన్ కమిటీలు లేకపోవడంతో సహకార సంఘాల అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఎటువంటి ఉత్తర్వులు జారీచేయకుండానే నోటి మాటతో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని కింది స్థాయి సిబ్బంది వాపోతున్నారు. ప్రామిసరీ నోటుపై సంతకాలు తీసుకోవడమంటే రైతుల గౌరవానికి భంగం కలిగించడమేనని మాజీ జడ్పీటీసీ, టీడీపీ నేత బుంగా సింహాద్రి పేర్కొన్నారు. రైతులను భయభ్రాంతులకు గురిచేసే ఇటువంటి లోపభూయిష్టమైన చర్యలను మానుకోవాలని అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై డీసీసీబీ కరప బ్రాంచి మేనేజరు సున్నమాచరరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా... నాబార్డు ఆదేశాల మేరకు రుణాల రెన్యువల్‌కు వచ్చే రైతుల నుంచి గత రెండేళ్లుగా ప్రామిసరీ నోటు రాయించుకుంటున్నామన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని సొసైటీల్లో ఈ పద్ధతి కొనసాగుతోందని చెప్పారు.

ముంపునీటి ప్రదేశాల ప్రక్షాళనకు చర్యలు: ఎంపీడీవో అనుపమ

కరప, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ముంపునీరు చేరి రోజుల తరబడి నిలిచిపోతున్న ప్రదేశాలను గుర్తించామని, అధికారులతో కలిసి వాటి ప్రక్షాళనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో మట్టపర్తి అనుపమ తెలిపారు. కరప సీపీడబ్ల్యూ స్కీమ్ ఎదురుగా ప్రధాన రహదారిపై నిలిచిపోయిన ముంపునీటి కుంటను సోమవారం ఆమె పలు శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రదేశాల్లోకి భారీగా నీరుచేరి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయన్నారు. వాహనాలు, ప్రయాణికుల రాకపోకలకు ప్రతిబంధకాలుగా మారాయన్నారు. కరపతో పాటు వేళంగి పీహెచ్‌సీ చెంతన, నడకుదురు, ఇతర గ్రామాల్లో ఇటువంటి ముంపునీటి ఆవాసాలను గుర్తించామన్నారు. ఈ కుంటల నుంచి నీటిని తరలించే మార్గాలపై అధికారులతో చర్చించారు. సమీపంలోని డ్రైన్‌లకు అనుసంధానిస్తే సమస్యకు కొంతైనా పరిష్కారం లభిస్తుందని ఒక అంచనాకు వచ్చామని, దీనిపై పూర్తిస్థాయిలో చర్చించి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పర్యటనలో పంచాయతీ రాజ్ శాఖ ఏఈ గండ్రేటి శైలజ, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్ ఏఈలు వీవీవీఎస్ వర్మన్, కొవ్వూరి సాయిబాబారెడ్డి, పెండెం నాగేష్, డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో 55 అర్జీలు

పిఠాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఏపీడీ వసంతమాధవి ప్రజల నుంచి 55 అర్జీలు స్వీకరించారు. మునిసిపాలిటీ 19, రెవెన్యూ 6, పంచాయతీ రాజ్ 4, డీఆర్డీఏ 8, ఇతర శాఖలకు 18 వినతులు వచ్చాయి. వీటిని పరిశీలించి పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఏపీడీ సూచించారు. మునిసిపల్ కమిషనరు కనకారావు, తహసీల్దార్లు వీవీ గోపాలకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పిఠాపురం బైపాస్‌లో ప్రభుత్వ స్థలాలు, కాలువలు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ కార్యదర్శి సాకా రామకృష్ణ వినతిపత్రం అందజేశారు.

మున్సిపల్ ఆదాయంపై దృష్టి సారించాలి

పెద్దాపురం మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ తులసీమంగతాయారు

పెద్దాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఆదాయంపై దృష్టిసారించాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. అమృత్ నిధులు, ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణం కోసం కౌన్సిలర్ విడదాసరి రాజా ప్రశ్నించారు. మెయిన్‌రోడ్డులోని మున్సిపల్ స్థలంలో వాణిజ్య సముదాయల నిర్మాణంపై కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ ప్రశ్నించారు. ఆదాయ మార్గాలను పెంచాలన్నారు. మంచినీటి బోర్ల నిర్మాణం చేపట్టిన తర్వాత వాటి కాలపరిమితి ఎంత ఉంటుందని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను కౌన్సిలర్ తులికి సత్యభాస్కరరావు ప్రశ్నించారు. టిడ్కో ఇళ్లు, శతాబ్ది పార్కు నిర్వహణపై కౌన్సిలర్ ఆకుల కృష్ణబాహుజీ ప్రశ్నించారు. పలువురు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రశ్నించారు. వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కమిషనరు కె.శ్రీకాంత్‌రెడ్డి, డీఈ ప్రకాశరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, ఆర్ఐ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ల నిరసన

సామర్లకోట, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎండీయూ ఆపరేటర్లను తొలగించాలని ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ సోమవారం వారు స్టేషన్ సెంటర్లోని గడియార స్తంభం వద్ద ఆందోళన చేపట్టారు. డి.సత్యానందం, జలసూత్రపు రమణ, దాసరి సత్తిబాబు, మాకిరెడ్డి శ్రీను, పలివెల అంజిబాబు, చెల్లుబోయిన అప్పారావు, సంపెంగతోట బుజ్జి తదితరులు పాల్గొన్నారు.





సమైక్యతా ర్యాలీలో పాల్గొన్న నాయకులు, యువకులు

'ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలి'

కాకినాడ సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): ఏ మతమైనా, ఏ కులమైనా మనమంతా భారతీయులమేనని, ఉగ్రవాదం-మతోన్మాదం నశించాలని నినదిస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. కాకినాడ జీజీహెచ్ ఎదురుగా గల మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మొదలైన ర్యాలీ ఇంద్రపాలెం వంతెన గల అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగింది. సీపీఎం నగర కమిటీ సభ్యుడు కె.సత్తిరాజు, అంబేడ్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో దేశమంతా కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలిచిందన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికులకు నివాళులర్పించారు. సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, సభ్యులు మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణతో పాటు చంద్రమళ్ల పద్మ, కె.వీరబాబు, సీహెచ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మీజిల్స్, రూబెల్స్ నిర్మూలించాలి'



ఫ్లెక్సీ బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

కలెక్టరేట్ (కాకినాడ), మే 26 (ఆంధ్రజ్యోతి): బాలలకు రెండు డోసుల మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్లు ఇవ్వడం ద్వారా నిర్మూలించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. ఈ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన ఫ్లెక్సీ బ్యానర్‌ను సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇంటింటా సర్వే చేసి ఈ టీకాలను బాలలకు వేయాలన్నారు. జూలై వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. డీఆర్వో వెంకట్రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సుబ్బరాజు, డీఎల్‌టీవో డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.



బాస్కెట్‌బాల్ శిక్షణ పొందుతున్న చిన్నారులు

విజయవంతంగా వేసవి క్రీడా శిక్షణా శిబిరం

సామర్లకోట, మే 26 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ప్రభుత్వ కళాశాల ఆవరణలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు గుడ్ ఫ్రెండ్స్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు విప్పర్తి కొండలరావు, మహ్మద్ షఫీయుల్లా తెలిపారు. పౌష్టికాహారంలో భాగంగా సోమవారం క్రీడాకారులకు అరటిపండ్లు, చిక్కీలు అందజేశారు. చెక్కా నరేష్, తాడి కళ్యాణ్, సైఫుల్లా, కుంచే శ్రీను, సత్యానందం, మణిరాజు, బులిరాజు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్‌గా భరత్

జగ్గంపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా గోకవరం మండలానికి చెందిన కడప భరత్‌కుమార్‌కు ఎన్నియ్యారు. సోమవారం అధికారికంగా అమరావతి నుంచి మార్కెట్ యార్డుకు మెయిల్ వచ్చింది. కమిటీతో పాటు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను గౌరవాధ్యక్షుడిగా నియమిస్తున్నట్టు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 40 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, మే 26(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఏపీవో(జీ) డీఎన్వీ రమణతో కలిసి ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ప్రజలనుంచి 40 అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లా డుతూ అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరిం చాలని సూచించారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లకు అటవీశాఖ అనుమతులు మంజూరు చేయాలని, తాగునీరు అందించాలని, పాఠశాల భవనాలు నిర్మించాలని, ఇంటింటికి విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, డిప్యూటీ డైరక్టర్లు ఎం.రు క్మాండయ్య, షరీఫ్, డీఎల్‌డీవో కె.కోటేశ్వరరావు, ఏపీడీ బి.సత్యానారాయణ, జీసీసీడీఎం జి.పార్వతీశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.వెంకటరమణ, ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, గాబ్రి యేలు, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకే నూరు శాతం ఉద్యోగాలివ్వాలి

చింతూరు, మే 26(ఆంధ్రజ్యోతి): మన్యంలో ఆదివాసీలకే నూరు శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఎం డిమాండ్ చేసింది. సోమవారం గ్రామ సచివాలయాల వద్ద నిరసనలు చేపట్టి వినతి పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యుడు సీసం సురేష్, పొడియం లక్ష్మణ్, మల్లం సుబ్బమ్మ మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ మేరకు మన్యంలో ఆదివాసీలకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు నూరు శాతం కల్పించేలా ప్రత్యేక జీవో విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. మన్యంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి ఆయా పోస్టులను ఆదివాసీ నిరుద్యోగులతోనే భర్తీ చేయాలన్నారు. సవలం కన్నయ్య, పాండ్రుం సుబ్బారావు, పాం డ్రుం నాగార్జున, శ్యామల తమ్మయ్య పాల్గొన్నారు.


చింతూరు సచివాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

బచ్చులూరులో కార్డన్ సెర్చ్


ఒక ఇంటిలో తనిఖీలు చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అమిత్‌బర్దర్, చింతూరు అడిషనల్ ఎస్పీ పంకజ్‌కుమార్ మీనా, రంపచోడవరం ఓఎస్‌డీ జగదీష్ అడహల్లి ఆదేశాల మేరకు డొంకరాయి ఎస్ఐ శివకుమార్ సిబ్బందితో సీఆర్పీఎఫ్ పోలీసులు, యాంటీ నక్సల్ స్క్వాడ్ పోలీసులతో బచ్చులూరు గ్రామంలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గామంలో ఉన్న ఇళ్లు మొత్తం క్షుణ్ణంగా పరిశీలించి గ్రామంలో నివసిస్తున్నవారి వివరాలు, గంజాయి కేసులో అరెస్ట్ అయిన వారి వివరాలు సేకరించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో ఎవరూ గంజాయి జోలికి పోవకూడదని, గంజాయి వల్ల చాలా కుటుంబాలు నాశనం అవుతున్నాయన్నారు. మావోయిస్టులకు ఎటువంటి సహకారం అందించకూడదని, వారికి సహాయ అందిస్తే ఉపా చట్టం కింద కేసు నమోదుచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీలు




వై.రామవరం:చవిటిదిబ్బలులో తిరంగా ర్యాలీలో బీజేపీ నాయకులు, ఎటపాక:నెల్లిపాకలో తిరంగా ర్యాలీ

వై.రామవరం, మే 26(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రవాదులను అంతమొందించేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయానికి మద్దతుగా బీజేపీ మండల అధ్యక్షుడు కడబాల ఆదివిష్ణు ఆధ్వర్యంలో చవిటిదిబ్బలు గ్రామంలో సోమవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. భారత భూమిపై దాడి చేస్తే పర్యావసనం ఎలా ఉంటుందో సైనిక శక్తి ద్వారా మోదీ నిరూపించారన్నారు. కార్యక్రమంలో రంపచోడవరం కన్వీనర్ ఈక బుల్లికొండలదొర, నాయకులు సీతారామన్నదొర, జిల్లా కార్యదర్శులు స్వప్న కుమారి, కె.కృష్ణారెడ్డి, కుంజం రామారావు, పల్లాల స్వామిరెడ్డి, ఉపాధ్యక్షులు వెదుళ్ల సత్యవతి పాల్గొన్నారు.

పాకిస్థాన్ వెన్నులో వణుకు

ఎటపాక, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ వెన్నులో వణుకు పుట్టించిందని బీజేపీ మండలాధ్యక్షుడు నలజాల శ్యామ్ ప్రసాద్, టీడీపీ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి గడేసుల రంజిత్, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు మారాసు గంగాధర్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం నెల్లిపాక గ్రామంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. నెల్లిపాక గ్రామ శివారు ప్రాంతం నుంచి సెంటర్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డి రామకృష్ణ, నరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన నాయకులు


మహానాడుకు వెళ్తున్న టీడీపీ నాయకులు

దేవీపట్నం, మే 26(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో మంగళ, బుధ, గురువారాల్లో జరిగే మహానాడుకి దేవీపట్నం మండలం నుంచి టీడీపీ మండల కన్వీనర్ మరిశెట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఇందుకూరుపేట, ఇందుకూరు, పాముగండి, వెలగపల్లి, వి.రామన్నపాలెం, ఫజుల్లాబాద్ తదితర గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పలు వాహనాల్లో మహానాడుకు వెళ్లారు. కార్యక్రమంలో మాగాపు బాబురావు, ముచ్చు వీర వెంకటసత్యనారాయణ, కారం పోశమ్మ, కుంజం శివదొర, కరణం సత్తిబాబు, అంజిరెడ్డి సత్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో యోగాంధ్ర

వై.రామవరం, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు సచివాలయాల్లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు. అయా సచివాలయాల పరిధిలో పలువురు యోగాసనాల్లో పాల్గొన్నారు. వచ్చే నెల 9వరకు ఒక్కో రోజు ఒక్కో ప్రభుత్వశాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో తెలిపారు

సారాతో వ్యక్తి అరెస్టు

దేవీపట్నం, మే 26(ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేటలో సారా తయారుచేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ షరీఫ్ సోమవారం సిబ్బందితో దాడి చేశారు. 20లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఒకర్ని అరెస్టు చేశారు. వంద లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

రంపచోడవరం, మే (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ప్రభుత్వ ఆక్రమణ భూములను గుర్తించి వాటి తొలగింపునకు చర్యలు చేపట్టామని తహసీల్దారు పి.రామకృష్ణ తెలిపారు. తొలుత మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న 389 ఆక్రమణలను గుర్తించి ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామన్నారు.

ఆదివాసీల డిమాండ్లపై ఐటీడీఏ పీవో ఆరా


దీక్షా శిబిరాన్ని సందర్శించిన పీవో

చింతూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల దీక్షా శిబిరాన్ని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ సోమవారం సందర్శించారు. మన్యంలో నూరు శాతం స్థానిక ఆదివాసీలకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలు చింతూరు ఐటీడీఏ ముందు రిలే దీక్షలు చేస్తున్న విషయం విదితమే. సోమవారం దీక్షా శిబిరం వద్దకు పీవో వెళ్లి దీక్ష చేస్తున్న వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకు న్నారు. డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేస్తామని పీవో హామీ ఇచ్చారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు

బస్సులు, కార్లలో భారీగా పయనం


ప్రత్తిపాడులో మహానాడు వెళ్లే కార్యకర్తల కాన్వాయ్‌కు జెండా ఊపుతున్న టీడీపీ నాయకులు


గండేపల్లి నుంచి కడప మహానాడుకు తరలివెళ్తున్న తెలుగు తమ్ముళ్లు

జగ్గంపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న టీడీపీ పసుపు పండుగ మహానాడు జగ్గంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో 200మంది ప్రతినిధులు సోమవారం జగ్గంపేట టీడీపీ కార్యాలయం నుంచి బస్సుల్లో బయలుదేరివెళ్లారు. ఈ బస్సులను జ్యోతుల నెహ్రూ సతీమణి జ్యోతుల మణి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. టీడీపీ గండేపల్లి మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు, మారిశెట్టి భద్రం, చదరం చంటిబాబు, అడపా భరత్, జీను మణిబాబు, బొల్లంరెడ్డి రామకృష్ణ, రేఖ బుల్లిరాజు, పాలకుర్తి ఆదినారాయణ, దాపర్తి సీతారామయ్య, కంచుకుర్తి రాఘవ, మండపాక అప్పన్నదొర, నవమాటి ఆనంద్, ఉప్పలపాటి బుల్లి అబ్బులు పాల్గొన్నారు.

మహానాడులో ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే నెహ్రూ


కడపలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

కడపలో టీడీపీ మహానాడులో భోజనాల ఏర్పాట్లను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరిశీలించారు. సోమవారం ఆవకాయ పచ్చడి తయారీని, మూడు రోజులు కావాల్సిన ఆహార పదార్థాలను మహానాడు భోజనాలు కమిటీ సభ్యుడు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పర్యవేక్షించి పరిశీలించారు. అలాగే కడపలో నకాష్ వీధిలో అమీన్ పీర్ దర్గా (పెద్ద దర్గా)ను జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్ సందర్శించారు. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి మీసాలరాజు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు, తూము కుమార్ తదితరులున్నారు.

గండేపల్లి: గండేపల్లి మండలం నుంచి ఒక బస్సు, 20 కార్లలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్, మండల నాయకులు జాస్తి వసంత్, బొల్లంరెడ్డి రామకృష్ణ, పాలకుర్తి ఆదినారాయణ, పైలా వెంకన్న, వెంపాటి రాజు, అడబాల ఆంజనేయులు దాపర్తి సీతారామయ్య కడప తరలివెళ్లారు.

ప్రత్తిపాడు: కడప జిల్లాలో టీడీపీ మహానాడుకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో నియోజకవర్గ నలుమూలల నుంచి తెలుగు తమ్ముళ్లు బయల్దేరారు. 4 మండలాల నుంచి ప్రత్తిపాడు పార్టీ కార్యాలయానికి సోమవారం ఉదయం చేరుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు హైస్కూల్ రోడ్డులో ర్యాలీ నిర్వహించి ప్రధాన రహదారి సెంటర్‌లో ఉన్న దివంగత టీడీపీ నేత వరుపుల రాజా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి బస్సులు, కారుల్లోను బయల్దేరగా కాన్వాయ్‌ను టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, అమరాది వెంకట్రావు, బద్ది రామారావులు జెండా ఊపి ప్రారంభించారు. టీడీపీ నాయకులు ఉల్లి వీరభద్రావు, ఇతంశెట్టి భాస్కరబాబు, జ్యోతుల పెద బాబు, పసగడుగుల వెంకటరమణ, సుంకర భవాని, ఇంధన ఏసుబాబు, పల్లా గోపి, లొండా లోవరాజు,బసవా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రౌతులపూడి: రౌతులపూడి మండలం నుంచి సుమారు 20 కార్లలో తరలివెళ్లారు. తెలుగు తమ్ముళ్లు అన్ని గ్రామాల నుంచి కార్లలో ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా నివాసానికి చేరుకుని అక్కడ నుంచి వెళ్లారు.

కోటనందూరు: కోటనందూరు మండలం నుంచి టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో 20 కార్లలో 150మంది వరకూ తరలివెళ్లారు. తరలివెళ్లిన నేతల్లో అంకంరెడ్డి రమేష్, పెంటకోట భాస్కర్ సత్యనారాయణ, పోతల సూరిబాబు, పెనుమతి నాగేశ్వరరావు, వెలగ వెంకట కృష్ణారావు, షేక్‌నవాబ్‌జానీ, బైలపూడి శ్రీరాంమూర్తి, గడ్డం కొండయ్యనాయుడు, చింతకాయల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుదారులకు సౌకర్యాలను కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్

రౌతులపూడి, మే 26 (ఆంధ్రజ్యోతి): జూన్ నెల 1 నుంచి రేషన్ షాపుల ద్వారా రేషన్ పంపిణీ జరిగే తరుణంలో షాపుల వద్ద కార్డుదారులకు సౌకర్యాలను కల్పించాలని తహశీల్దార్ ఎన్వీనరేష్ డీలర్లకు సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మండల రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. షాపుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. కార్డుదారులకు తాగునీరుతో పాటు కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. స్టాక్ బోర్డు, స్టాక్ రిజిస్టర్, సందర్శకులు బుక్‌లు ఉండాలని తదితర అంశాలపై ఆదేశాలిచ్చారు.

ఎండీయూ ఆపరేటర్ల నిరసన

తుని రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎండీయూ ఆపరేటర్లను నిలుపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన బాట పట్టారు. తుని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా తుని పట్టణ, రూరల్ ప్రాంతాల ఎండీయూ ఆపరేటర్లు నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో తాము తీవ్రంగా నష్టపోయామని, నిర్ణయం వెనక్కి తీసుకుని తమను ఆదుకోవాలని తహశీల్దార్ ప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యవర్గ సభ్యులు సింహాచలం, రమణ, లోవరాజు, శ్రీనివాసరావు, నాగేంద్ర స్వామి, రాజు ఉన్నారు.


తుని తహశీల్దార్ ప్రసాద్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

1046 గృహాల పనులను పూర్తి చేయాలి

బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు


ప్రత్తిపాడులో మాట్లాడుతున్న ఈడీ

ప్రత్తిపాడు, మే 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గృహ నిర్మాణ శాఖకు సంబందించి జూన్ 12నాటికి 1046 గృహాల నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభించాలని బీసీ కార్పొరేషన్ ఈడీ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎ.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు మందిరంలో సోమవారం ప్రత్తిపాడు, శంఖవరం, ఏలేశ్వరం అర్బన్, ఏలేశ్వరం రూరల్ మండలాలకు సంబంధించి గృహ నిర్మాణ శాఖాధికారులు, వెలుగు, ఉపాధి, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 734 గృహాలు పూర్తికాగా, 312 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని, వీటిని పక్షంరోజుల్లో పూర్తి చేయాలన్నారు. బీసీ,ఎస్సీ లబ్ధిదారులకు అదనంగా రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన తరుణంలో అధికారులు, సిబ్బంది గృహ నిర్మాణంలో నూరుశాతం లక్ష్యాలు సాధించాలన్నారు. గృహ నిర్మాణశాఖ ఈఈ కేవీఆర్ గుప్తా మాట్లాడుతూ రూ.1.80లక్షలు గృహ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేయగా సెప్టెంబరు 10వ తరువాత ఇంకా పూర్తికాని ఇళ్లకు ప్రభుత్వం అదనంగా సేకరించిన నిధులతో లబ్ధిదారులు గృహ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవోలు ఎంవీఆర్ కుమార్‌బాబు, సూర్యనారాయణ, ఎస్ఎంకేజీ ప్రసాద్, హౌసింగ్ డీఈ సువర్ణరాజు, ఏఈలు ఆనంద్, వీరబాబు, మణికంఠ, ప్రియాంక, ఏపీవో కుమారస్వామి, ఏపీఎం వై.వెంకట్రావు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను రైతులు వినియోగించుకోండి

కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి, కత్తిపూడిలో జిల్లా కార్యవర్గ సమావేశం

శంఖవరం, మే 26 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం కోసం కేంద్రప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని రైతులు వినియోగించుకోవాలని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి పేర్కొన్నారు. సోమవారం కత్తిపూడి వర్తకసంఘం కల్యాణ మండపంలో జిల్లాస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా యువమోర్చా అధ్యక్షుడు సింగిలిదేవి సత్తిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ కేంద్రం పంటల బీమా పథకంలో నమోదు కావడం ద్వారా ప్రకృతి విపత్తుల నుంచి పంటలను కాపాడుకోవచ్చన్నారు. కేంద్ర పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరావు అన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరాజు, రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి రామకృష్ణ, బొమ్మిడి లోవ తదితరులు ఉన్నారు.


కత్తిపూడి సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

కొవిడ్ పట్ల అప్రమత్తం

గండేపల్లి పీహెచ్‌సీ డాక్టర్ నరేష్

గండేపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గండేపల్లి పీహెచ్‌సీ డాక్టర్ నరేష్ అన్నారు. సోమవారం ఆయన పీహెచ్‌సీలో మాట్లాడుతూ పలు జిల్లాల్లో అక్కడక్కడ కొవిడ్ కేసులు నమోదు కావడంతో ప్రతీ ఒక్కరూ చుట్టు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మాస్కులు, శానిటైజర్ వాడాలన్నారు. ఎవరికైనా దగ్గు, జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి మండలానికి ఎవరైనా వస్తే కొవిడ్ ఇటువంటి లక్షణాలంటే పరీక్షలు చేయించుకోవాలన్నారు. కిడ్నీ, గుండె వ్యాధి ఉండి 60 ఏళ్లు దాటిన వారు తప్పనిసరిగా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

జగ్గంపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద దాతల సహకారంతో నిర్వహిస్తునన అన్న క్యాంటీన్‌లో సోమవారం జగ్గంపేట లారీ ఓనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ రామలక్ష్మి దంపతులు ఆర్థిక సాయంతో పేదలకు భోజనాలు ఏర్పాటు చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం పేదలకు అన్నం వడ్డించారు. జీను మణిబాబు, మారిశెట్టి రాధాకృష్ణ, పడాల రాజా, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, మారిశెట్టి పృథ్వీ, మారిశెట్టి వినోద్, దాపర్తి సీతారామయ్య, దేగల సత్తిబాబు, పీల మహేష్ పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ముగిసిన శిక్షణ తరగతులు

గండేపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ కార్యాలయ సిబ్బందికి నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతులు ముగిసినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. డాక్టర్ తెలుగు నీలిమ నేతృత్వంలో అభిలాష్, రోజా శ్రావణి సిబ్బందికి శిక్షణ ఇచ్చారన్నారు. అలాగే విద్యాప్రాంగణంలో ఏపీఈఏపీఎసెట్ 2025 ఆన్‌లైన్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు తెలిపారు. ఆదిత్య యూనివర్శిటీ క్యాంపస్‌లో ఉదయం 535కి మందికి 513, సాయంత్రం 535కి 518 మంది హాజరయ్యారన్నారు.

తుమ్మలపల్లి పరామర్శ

జగ్గంపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): కాండ్రేగులకు చెందిన యల్లపు వీరబాబు 24గంటల నొప్పికి ఆపరేషన్ చేయించుకోవడంతో జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. గంధం శ్రీనివాస్, మాదారపు వీరబాబు, నాగబోయిన శివ, చిక్కాల భగవాన్, రేపూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల అందజేత

ఏలేశ్వరం, మే 26 (ఆంధ్రజ్యోతి): యువత అన్ని రంగాల్లోను రాణించాలని జనసేన మండలాధ్యక్షుడు పలివెల వెంకటేష్ అన్నారు. సోమవారం మండలంలోని సి.రాయవరంలో క్రికెట్ యూత్ సభ్యులకు క్రికెట్ బ్యాట్, కిట్లను బొట్టు సురేష్, వెంకటేష్ అందజేశారు.

పాఠ్య పుస్తకాలు సిద్ధం

తొండంగి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలను విద్యాశాఖ సిద్ధం చేసింది. మొదటి సెమ్‌కు చెందిన స్పెల్ 1లో 21591, స్పెల్ 2లో 9340 మొత్తంగా 30931 పుస్తకాలు మండల కేంద్రానికి చేరాయి. సోమవారం సీఆర్పీలు, పార్ట్‌టైమ్ ఇనస్ట్రక్టర్లు వీటిని తరగతి వారీగా విడదీసే పనిలో పడ్డారు. పాఠశాలలు తెరిచేనాటికి అందరి విద్యార్థుల చేతుల్లో పాఠ్య పుస్తకాలు ఉండాలన్న లక్ష్యంతో పుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్టు ఎంఈవోలు షేక్ బాబ్జి, ఏ.సుబ్బిరెడ్డి పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం, మే 26 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి సోమవారం ఒకదాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. నక్కపల్లి మండలం అడ్డురోడ్డుకు చెందిన నాతా సూర్యారావు ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా దాతను అభినందించి స్వామివారి ప్రసాదం ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

రౌతులపూడిలో అన్నదానం

రౌతులపూడి, మే 26 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి మార్కెట్ సెంటర్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద శ్రీఆంజనేయ వ్యవసాయ కూలీ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

గ్రామ సచివాలయాల వద్ద పడిగాపులు

• ప్రభుత్వ సేవల కోసం అర్జీదారులు


సచివాలయం వద్ద సిబ్బంది కోసం ఎదురుచూస్తున్న గ్రామస్తులు

ఎటపాక,మే 26 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ సేవలు, వివిధ రకాల సమస్యలు, అనేక రకాల ధ్రువపత్రాల కోసం గ్రామ, వార్డుసచివాలయాలకు వస్తున్న అర్జీదారులకు గంటల కొద్దీ నిరీక్షణ తప్పడంలేదు. ఉదయం పది గంటల సమయానికే అర్జీదారులు సచివాలయాలకు చేరుకుంటున్నారు. కానీ సచివాలయాల సిబ్బంది 10.30గంటలు దాటిన తర్వాత సచివాలయాలకు వస్తున్నారు. అర్జీదారులు ప్రశ్నిస్తే సర్వర్ సమస్య ఉందని, తాము ముందు వచ్చినా ఎలాంటి ఉపయోగంలేదని బదులిస్తున్నారు. సోమవారం విస్సాపురం గ్రామ సచివాలయంలో అర్జీదారులు గంటల కొద్దీ పడిగాపులు కాశారు. విస్సాపురం పంచాయతీ పరిధిలో 21గ్రామాలు ఉన్నాయి. సచివాలయానికి రావాలంటే కొన్ని గ్రామాల ప్రజలు 15కిలోమీటర్లు దాటి రావాలి. చలంపాలెం, ఎర్రగట్టు గ్రామస్తులు 10కిలోమీటర్లు, బండిరేవు, మాధవరావుపేట గ్రామస్తులు రావాలంటే 8 కిలోమీటర్లు ప్రయాణించాలి. పనులు మానుకుని వివిధ రకాల ధ్రువపత్రాలు, సమస్యలపై వచ్చి గంట కొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని 14గ్రామ సచివాలయాల్లో కీలకంగా వ్యవహరించే గ్రామ కార్యదర్శులు విధుల్లో సమయపాలన పాటించకపోవడంతో సిబ్బంది కూడా అదే బాటలో వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గ్రామ సచివాలయాల్లో సిబ్బంది విధులకు సమయానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అర్జీదారులు కోరుతున్నారు.

వారం రోజులుగా తిరుగుతున్నాను

సున్నం జకరయ్య, ఎర్రగట్టు గ్రామస్తుడు



కొత్తరేషన్‌లో కార్డులో పిల్లల యాడింగ్ కోసం వారం రోజుల నుంచి విస్సాపురం సచివాలయానికి తిరుగుతున్నా. సర్వర్ సమస్య ఉందని, వచ్చినప్పుడల్లా మరుసటి రోజు రమ్మంటు న్నారు, పనులు మానుకుని వారం రోజులు కుటుంబ సభ్యులతో తిరుగుతున్నా. సచివాలయం వద్దకు వచ్చి గంటల కొద్దీ వేచి ఉంటున్నాను. ఎవరూ సక్రమంగా సమాధానం చెప్పడంలేదు.

'ఆదివాసీ ఉద్యమాలకు మద్దతు'

చింతూరు, మే 26(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఆదివాసీలు చేపట్టిన ఉద్యమానికి ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంపూర్ణ మద్దతు ఉంటుందని సెంట్రల్ ఆర్గనైజర్ మడివి నెహ్రూ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగ బద్ధమైన హక్కు లను ఆదివాసీలు రాజ్యాంగ పరంగా సాధించుకోవడం కోసం ఉద్యమ బాట పట్టడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సత్వర కాలంలో ఆదివాసీలకు అనుకూలమైన విధాన నిర్ణయాన్ని తీసుకోవాలని ఆయన కోరారు.

చిన్నారులకు ఎంతో మేలు జరిగింది


సమారిటెన్స్ ఫర్ ద నేషన్ నిర్మించిన అంగన్వాడీ కేంద్రం

చింతూరు, మే 26(ఆంధ్రజ్యోతి): సమారిటెన్స్ ఫర్ ద నేషన్ నేతృత్వంలో నిధులు కేటాయించి చిన్నారులకు అంగన్వాడీ కేంద్ర రూఫ్ టాప్ నిలయా లను నిర్మించడం అభినందనీయమని ఏడుగురాళ్లపల్లి సర్పంచ్ పాయం చంద్రయ్య అన్నారు. సమారిటెన్స్ ఫర్ ద నేషన్ ఆధ్వర్యంలో చింతూరు మండలంలో మారుమూల గ్రామాలైన పూంగుట్ట, పాత వినాయకపురం, ఆముదాలపేటలలో అంగన్వాడీ కేంద్రాలు నిర్మించారు. సోమవారం ఆయా కేంద్రాలను సర్పంచ్ పాయం చంద్రయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. సంస్థ డైరెక్టర్ రాంకుమార్, ఐసీడీఎస్ సిబ్బంది, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.